POSTAL REGD.NO.PRAKASAM/16/2024-2026
REGD.NO. 37926/83
ESTABLISHED : 1983
సెప్టెంబరు 2024
వెల – ₹ 10.00

# సాయిబాబా

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక
సంపుటి: 42 సంచిక: 05



## పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి జయంతి

27-09-2024 (తిథి భాద్రపద బహుళ దశమి)

# ఈ నెల పండుగలు

సెప్టెంబరు 01 - శ్రీ గురుచరిత్ర గ్రంథ కృతజ్ఞతార్చన

సెప్టెంబరు 03 - శ్రీ అవధూత చీరాల స్వామివారి ఆరాధన

సెప్టెంబరు 07 - వినాయక చవితి

సెప్టెంబరు 07 - శ్రీపాద శ్రీ వల్లభ స్వామి జయంతి (తిథి - భాద్రపద శుద్ధ చతుర్థి)

సెప్టెంబరు 08 - గజానన్ మహారాజ్ ఆరాధన (తిథి - భాద్రపద శుద్ధ పంచమి)

సెప్టెంబరు 27 - పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ తల్లి జయంతి (తిథి భాద్రపద బహుళ దశమి)

"పారాయణంటే భగవంతుని లీలలు, అవతార విశేషాలు చదువుకుంటూ, వింటూ - అందులో పరాయణత చెందడమే. క్రమంగా మన తలంపులు, ఆచరణ, ఆశయాలు అన్నీ ఆయన పరంగా మారడమే - సంసారుల జీవితాలు తమ కుటుంబ శ్రేయస్సే లక్ష్యంగా కల్గినట్లు; ఏమి చేస్తున్నా, ఎక్కడున్నా మరపురానట్లు; మానవులందరు తాము తమ శరీరాలు, పేర్లు అన్న భావంతో తాదాత్మ్యం చెందినట్లు - భగవంతుని ప్రీతిని, స్మరణనూ పెంచేవిగా మారేలాగున చదవడము, మననం చేయడము - యివే పారాయణ! ప్రేయసికి ప్రియమైనవన్నీ ప్రియునికి ప్రీతికరములై, మిగిలినవన్నీ అయిష్టమైనట్లు క్రమంగా మన సద్గురువుకు ప్రీతికరమైన మాటలు, పనులు, నడవడులే మనకు ప్రీతికరములవడం పరాయణత. అది కల్గేలా సద్గ్రంథాలను చదవడం పారాయణ."

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

# సాయిబాబాను పూజిస్తే కోరికలు తీరుతాయా?

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

"శ్రీ సాయిని పూజించేవారికి కష్టాలెక్కువగా వస్తాయంటారు. నిజమేనా?" అని కొందరు అడుగుతూ వుంటారు. శ్రీ సాయి అమిత దయామయుడని, ఆయన నర్చిస్తే త్వరలో కష్టాలు తీరి, కోరికలు నేరవేరుతాయని నానాటికీ దేశంలోను, వెలుపలాగూడ వ్యాపిస్తున్న సాయిభక్తి నిరూపిస్తున్నది. అయితే మరి వారిని కొలుస్తున్నా కష్టాలు తీరనివారున్నారుగదా? అన్న ప్రశ్న ఉదయిస్తుంది.

అసలిటువంటి ప్రశ్నలు కర్మ, అనుగ్రహముల తత్త్వాన్ని సరిగా అవగాహన చేసుకోనందువలన కల్గుతాయి. కర్మల ఫలితాలనే మన మనుభవిస్తామని, అది సుఖదుఃఖ స్వరూపమని, మనము కర్మలో చిక్కుకోవటానికి కారణం అజ్ఞానమనీ ప్రపంచంలోని ఆధ్యాత్మిక సాంప్రదాయాలన్నీ చెబుతున్నాయి. కనుక మనం ఆత్మజ్ఞానం చెందేవరకూ అసలుదుఃఖమన్నదివెంటాడవలసినదే.సాయినాశ్రయించినా ఆయన చెప్పినట్లు నడుచుకొని, ఆయనను భక్తితో ధ్యానించి ఆయన మనలను చేర్చదలచిన గమ్యమైన ఆత్మజ్ఞానాన్ని పొందే వరకూ ఎప్పుడో ఒకప్పుడు, ఏదో రూపంలో దుఃఖము వెన్నంటుతూంది, అంతేగాని ఆయననారాధిస్తే కష్టాలు రావడానికి సద్గురువు నారాధించడం మహా పాపమైతేగా! కర్మయొక్క తత్త్వాన్ని అర్థం చేసుకుంటే యిట్టి అపోహకే తావులేదు.

అయితే మనం సాయిని కొలుస్తున్నా కష్టాలుండటమేమిటని ప్రశ్న మరో రూపం ధరిస్తుంది.

కర్మ అనేది పూర్వజన్మలలో రాగద్వేషపూరితమైన కర్మలలో త్రికరణాలతో మనం పాల్గొనడం వలన ఒక వంక అంతరంగంలో సంస్కార (అంతరంగం యొక్క అభినివేశము లేక అలవాటు) రూపంలోను, బాహ్యంగా వెనుకటి కర్మల ఫలితం రూపంలోనూ అది మనను వెంటాడుతోంది. కర్మఫలానుభవం రూపంలో ఆ పాత అజ్ఞాన సంస్కారాలు, ఆ కర్మఫలాలు మనలో కరిగి, మనకు-ఆత్మజ్ఞానానికీ మధ్య పేరుకొన్న మాలిన్యం క్షాళనం గావడానికి కరుణామయుడైన పరమాత్మ నిర్మించిన ప్రేమసూత్రం కర్మసూత్రం. అయితే యీ సదవకాశాన్ని వినియోగించుకొనక అజ్ఞానులైన మానవులు మరలా రాగద్వేషాలవలన ప్రేరేపించబడి కర్మలు చేస్తూ మరలా ఫలాన్ని, సంస్కారాన్ని పెంచుకొంటారు. అలా చేయకుండే మార్గం వివేకయుక్తమైన నిష్కామకర్మయేనని మహనీయులు, భగవద్గీత వంటి ప్రామాణిక గ్రంథాలూ చెబుతున్నాయి. ఆ ప్రకారం ఆచరించక అట్టి ఫలితాలను మాత్రం ఆశిస్తాము. అదెలా పొసుగుతుంది? మన కర్మఫలాన్ని విడచి ఎల్లప్పుడూ కోరిన వెంటనే అన్నింటినీ ఆయన నెరవేరుస్తూండాలని ఆశిస్తాము. అదే సాధ్యమైతే యిక యీ ప్రపంచంలో ధర్మమే ఎవరూ ఆచరించనక్కర లేదుగదా! అంతేగాదు. అసలు ఏ మానవుడూ వేరే దుఃఖనాశరూపమైన ముక్తికోసం యత్నించవలసిన అవసరమేమిటి? అందుకే సాయి ఒక వంక ఐహికమైన కోర్కెలతో వారిని దర్శించగూడదని చెబుతున్న భక్తుణ్ణి మందలిస్తూనే, మరొకవంక "నీవు సత్యాన్ని అంటిపెట్టుకొంటే నీచెంతనే వుంటాను" అని గూడ అన్నారు. ఆయన హెచ్చరించినా తమ నడవడిని సరిదిద్దుకొనని భక్తుడితో "నేచెప్పినట్లు చేయనివాడితో నా కేమిపని? అని మందలించారు. తన స్వజనం మరణించారని అలిగిన భక్తునితో "నీవు కేవలం యిటువంటి వాటికోసమే అయితే నా వద్దకు రానవసరంలేదు" అని అదిలించారుగూడ. "నేను అల్లా బానిసను' అని, ఆయన ఆజ్ఞలేక తానేమి చేయజాలననీ ఆయన అనేవారు. ఈ మాటల కర్థమదే.

లౌకికమైన న్యాయ చట్టాలలాగానే కర్మసూత్రం

**మిగతా 11వ పేజీలో**

ఆధ్యాత్మిక వైజ్ఞానిక మాసపత్రిక

# సాయిబాబా

OFFICIAL ORGAN OF SRI MANGA BHARADWAJA TRUST

సంపుటి:42 సెప్టెంబరు - 2024 సంచిక:05

**పరమపూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారిచే స్థాపించబడిన ఏకైక పత్రిక, మన "సాయిబాబా"**

## విషయ సూచిక


| | | | |
|---|---|---|---|
| 01. | సాయిబాబాను పూజిస్తే కోరికలు తీరుతాయా? | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 03 |
| 02. | పరిప్రశ్న | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 05 |
| 03. | సత్సంగాలలో సమైక్యత | పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ | 06 |
| 04. | మాతృదేవి స్మృతులు | శ్రీ పూర్ణచంద్రరావు | 10 |
| 05. | మాతృదేవి సన్నిధిలో గురుపూర్ణిమ | శ్రీమతి టి. పద్మావతి | 12 |
| 06. | వార్తాలాపము | శ్రీమతి అడిదం వేదవతి | 14 |
| 07. | బుద్ధ ధ్యాన హృదయము | పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ | 17 |
| 08. | భగవాన్ శ్రీ భరద్వాజ | శ్రీమతి శ్రీదేవి | 19 |
| 09. | శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు | శ్రీమతి శ్రీదేవి | 23 |
| 10. | ద్వారకామాయి అనుభవమండపము | శ్రీమతి సరోజిని | 25 |
| 11. | ఆచార్యుని అద్భుత లీలలు | శ్రీమతి స్వాతి | 27 |


**చిరునామా**

Sri Manga Bharadwaja Trust,
Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar,
Jaipuri Colony, Nagole, Hyderabad - 500068
Phone No. +91 - 74160 41550

**www.saibharadwaja.org**

చీఫ్ ఎడిటర్: డా|| ఆర్.ఎస్. శశిధర్, పిహెచ్. డి

**చందా వివరములు**

విడి ప్రతి : ₹ 10-00
సంవత్సర చందా : ₹100-00

సాయిబాబా పత్రికలో వెలువడే వ్యాసాలకు, అభిప్రాయాలకు ఆయా రచయితలే బాధ్యులు.


# పరిప్రశ్న

**పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ**

**ప్రశ్న :- బ్రాహ్మణులు భూసురులా ? కార్తీక పురాణంలో బ్రాహ్మణుని గూర్చి భూసురుడని, దేవత అని వ్రాశారు. మరి బ్రహ్మజ్ఞుడినే బ్రాహ్మణుడని కొందరు చెపుతారు. ఏది నిజం ?**

**-రాజమ్మ, పల్లం పేట**

**జవాబు :-** ఆదిలో వర్ణవ్యవస్థ ఆయా వ్యక్తుల గుణకర్మల ననుసరించివారిస్వభావాలకుతగినవృత్తులనేర్పరచడానికి ఉద్భవించిందని మనుస్మృతి, పురాణాలలోని సృష్టి రచనాక్రమాన్ని చూస్తే తెలుస్తుంది. ఇందులో బ్రహ్మజ్ఞానం పొందినవారే బ్రాహ్మణులు. కాని మిగిలిన మూడు వర్ణాలవారు ద్విజులే సుమా! ఇందులో సహజమైన ప్రీతితో అర్థయుక్తంగా వేదాలను అధ్యయనం చేసి, లోకహితం కొరకు యజ్ఞయాగాదులను, తపస్సులను చేసే ప్రవృత్తి కలవారిని భూసురులు, విప్రులు అన్నారు. అట్టివారికి విధించబడిన జీవిత విధానం చూస్తే, తక్కిన సామాన్య మానవులవలె లౌకిక సంపదలకోసం ఆశించరాదని తెలుస్తుంది. వారి తృప్తి, సంతోషము పరమాధికంగా వుంటాయి. కనుక మానసికంగా దేవతల స్థాయిలో జీవిస్తూ, శారీరకంగా మాత్రమే ప్రకృతి సిద్ధమయిన అవసరాలను తీర్చుకుంటారు. అంతేకాక దేవతలు సృష్టియొక్క హితంకోసమే పనిచేసినట్లు వీరుకూడా చేస్తారు. కనుకనే వారిని భూసురులని అన్నారు. అట్టి గుణాలు లేనివారికి, అట్టి జీవిత విధానాలకు కట్టుబడనివారికి ఆ పేరు వర్తించదని ధర్మశాస్త్ర గ్రంథాలు చూస్తే తెలుస్తుంది. బ్రహ్మజ్ఞానం పొందినవారు విప్రులకంటే అధికులు కనుక వారు జన్మతః ఏ వర్ణానికి చెందినా బ్రాహ్మణులే అవుతారని



ఈ పత్రికలో వెలువడుతున్న ప్రామాణిక శ్లోకాలలో మీరు చూచేవుంటారు. అట్టివారెవరైనా గురుతుల్యులేనని శ్రీ ఆదిశంకరులు కూడా మానిషాపంచకంలో అంటారు. ●

(మార్చి 6, 2009 న ఒంగోలులో పూజ్యశ్రీ అలివేలు మంగమ్మ తల్లి అనుగ్రహ భాషణం)

# సత్సంగాలలో సమైక్యత

**పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ**

*గురు ర్బ్రహ్మ గురుర్విష్ణుః గురుర్దేవో మహేశ్వరః I*
*గురుస్సాక్షాత్ పరబ్రహ్మ తస్మైశ్రీ గురవే నమః II*
*అనంతార్య తనూజాతం సాయినాథ సమప్రభం I*
*బుచ్చిమాంబాసుతం వందే సర్వాభీష్ట ఫలప్రదం II*

**జై సాయిమాస్టర్ !**

మనమందరంగూడా మాస్టరుగారి యొక్క, బాబా యొక్క మహోత్సవాలను చాలా సందర్భాలుగా జరుపుకుంటూవున్నాం. ఆయనిచ్చినటువంటి శక్తిననుసరించి బాగానే జరుపుకుంటున్నామని చెప్పుకోవచ్చు. బాగా జరుపుకోవటం అంటే ఏమిటి? అంటే చాలామందిని ఆహ్వానించుకోవటం, భోజనాలు పెట్టడం, తర్వాత భజనలు, ఉపన్యాసాలు చెప్పుకోవడం. విందు భోజనాలు మనకు చేతనైనంత వరకు చేసుకుంటూ వుండటం చేస్తున్నాము. కొన్నిచోట్ల అన్నదానాలు కూడా జరుగుతున్నాయి. ఇంకా మంచి కార్యక్రమాలు కూడా చేస్తూవున్నారు. అయితే ఈ కార్యక్రమాల ద్వారా కొంత ఉపయోగం కొంతమందికి జరుగుతూనేవున్నది. మనకు కూడా జరుగుతూనేవుంది కాబట్టి మాత్రమే మనం చేసుకుంటున్నాం. మాస్టరుగారి ద్వారా మనకు ఎంతో కొంత మేలు జరగకపోతే మనం ఆయన దగ్గరికి రావటం గానీ ఆయనను యింతగా సేవించుకోవటంగాని, ఇట్లాంటి మహోత్సవాలను జరుపుకోవడం గానీ జరగదు. ఎందుకంటే ఎవరూ ఇవ్వని చోటికి వెళ్ళరు కదా! ఇచ్చే వాళ్లదగ్గరికే మనం వెళ్తాం. కాబట్టి ఆయన ఏదో యిస్తున్నారనే మనం వెళుతున్నాం.

ఆయనకు ఎంతో కొంత మనం సమర్పించుకుంటాం. తృణమో ఫణమో మన శక్తి మేరకు. కొంతమంది శక్తికిమించి చేసే వాళ్ళున్నారు. కొంతమంది శక్తి ఎంతో వుంటే కొద్దిగా చేసేవాళ్ళున్నారు. కొంతమంది వున్నంతవరకు చేసేవాళ్ళున్నారు. ఆయన ఎంత యిస్తే అంత స్వీకరిస్తారు. కాబట్టి మన సంస్కారాన్ని బట్టి, మన భక్తిని బట్టి, మన స్తోమతని బట్టి మనం చేసుకుంటూ వస్తున్నాం. అయితే మనం చేస్తున్న దానికి, ఆయన వైపునుంచి వచ్చేదానికి ఏమిటి తేడా? ఆయన మననుంచి ఆశించే దేమిటి? ఆయన మననుంచి కోరుకునేదేమిటి? అనేది కొంచెం ఆలోచించుకోవాలి.

మనం ఆయన మార్గాన నడుస్తున్నామని చాలామంది అనుకుంటున్నాం. ఆయన మార్గాన నడవడం అంటే ఏమిటని ఆలోచిస్తే.... 'మేము సత్సంగాలు చేసుకుంటున్నామండి, ఆయన మార్గంలోనే చేసుకుంటున్నాం' అని చాలామంది అనుకుంటూ వుంటాము. ఆయన మార్గంలో సత్సంగం చేసుకోవడమంటే? అందరూ రావటం కూర్చోవటం, తర్వాత సద్గ్రంథ పఠన (అంటే) ఒక మంచి పుస్తకాన్ని చదువుకోవటం, కాసేపు భజన చేసుకోవటం, తరువాత ఎవరన్నా సత్సంగం చేస్తే, కొంచెం మాట్లాడితే గనుక వినడం, ప్రసాదాలను స్వీకరించడం, వెళ్లిపోవడం. ఇదే అని మనం అనుకుంటున్నాం. మాస్టరుగారు చెప్పిన మార్గంలోనే కొంతమంది చాలా సింపుల్ గా, అంటే మాస్టరుగారు చెప్పినట్లుగా కొద్దిగా బొరుగులు, కొంచెం పళ్లు మాత్రమే యిస్తూ... అంటే పేదవాళ్లకు కూడా సత్సంగం చేసుకోవటానికి అవకాశం వచ్చేటట్టుగా మేము చేస్తున్నామండి. అదే మార్గంలో మేము నడుస్తున్నాం. ఆయన చెప్పినటువంటి పారాయణ చేసుకుంటున్నాం. సాయి లీలామృతము పారాయణ, శ్రీ గురుచరిత్ర పారాయణ, మహాత్ముల చరిత్రల పారాయణ ఆయనకి చాలా ఇష్టం. అందుకని తప్పకుండా మా దినచర్యగా

ఏ రోజూ మానకుండా మేము చేసుకోగలుగుతున్నాం-- అని కూడా అనుకుంటున్నాం. ఆయన చెప్పినటువంటి పేదలకు సహాయం చేయడం అనేది కూడా చేస్తున్నాము. బాబా చెప్పారు కదా పేదలకు సాయం చేస్తే చాలా మంచిదని. అలా బాబా మార్గంలోనూ, మాస్టరుగారి మార్గంలోనూ మేము నడుస్తున్నాం అని మనం చాలా మందిమి అనుకుంటున్నాం.

కాని మాస్టరుగారు అదేనా కోరుకుంటున్నది? అని మనం ఆలోచిస్తే, సత్సంగం చేసుకోమని చెప్పిన మాట నిజమే. సత్సంగం చేసుకుంటే ఆయన సంతోషించే మాట కూడా చాలా నిజమే. కానీ సత్సంగం ఎలా చేసుకోమన్నారు? అనేది మటుకు మనకు కొంచెం తేడా కనిపిస్తున్నది. ఒక్కొక్క సత్సంగం మొదలుపెడుతున్నాం, (మొదట) ఉధృతంగా సాగుతుంది. వందమంది, రెండొందల మంది దాకా వస్తారు. అంటే చాలాబాగా చేసుకుంటాం. ప్రసాద వినియోగం, భజనలు మొత్తం పెట్టుకుంటాం. కానీ ఎక్కడో ఒక చోట ఒకళ్లకొకళ్లకి తేడా వస్తున్నది. మానసిక స్పర్థలు ఏర్పడుతున్నాయి. ఏర్పడగానే ఏం చేస్తున్నారు? దాన్లోనుంచి విడిపోవడం జరుగుతున్నది. ఒకళ్లకొకళ్లకి ఒక సత్సంగంలోనే పడటం లేదు! ఒక సత్సంగంలోని శిష్యులకి ఇంకో సత్సంగంలోని శిష్యులకి అస్సలు పడటం లేదు! ఎందుకు పడటం లేదు? మాస్టరుగారు చెప్పినది ఇదేనా? అని ఆలోచిస్తే.... ఎందుకు పడటం లేదంటే చిన్నచిన్న కారణాలు కావచ్చు. చిన్న చిన్నవే, చాలా చిన్నవి, కొన్ని పెద్దవి కూడా వున్నాయి. కొంతమంది నాకు సరిగా మర్యాద చేయలేదనో, నన్ను ముందు కూర్చోపెట్టలేదనో, నాకు ప్రాధాన్యత యివ్వటం లేదనో, నాకు మైకు యివ్వటం లేదనో, పాట పాడించటం లేదనో... ఇలాంటి చిన్న విషయాలతో విభేదాలు పడుతున్నారు. ఒకరి అభిప్రాయాలు ఒకరికి సమన్వయ పడటంలేదు. అంటే.... ఇట్లా బాగా డెకరేషన్ చేద్దామని ఒకరన్నారనుకో, 'ఎందుకయ్యా సింపుల్ గా చేస్తే సరిపోతుంది' అని ఇంకోరంటారు. నలుగురున్నప్పుడు నాలుగనక తప్పదు. వీళ్లిద్దరికే వస్తుంది 'ఏందయ్యా బాగా చేసుకోక ఏం చేస్తాం' అంటారు కొంతమంది. 'ఎందుకయ్యా' అంటారు వీళ్లు. ఇద్దరూ సమన్వయ పడరు. 'బాగా చేసుకుందాం' అన్నదాని ప్రకారం పోయినా పర్వాలేదు. 'వద్దులే సింపుల్ గా చేసుకుందాము ఆ డబ్బుని వేరేగా వినియోగపరుచుకుందాము' అనే మనస్తత్వంతో అందరూ కలసి వెళ్ళినా పర్వాలేదు. ఈ రెండూ కాకుండా చిన్న చిన్న విషయాల్లో విభేదాలు వచ్చి, విడిపోవడం జరుగుతున్నది. ఇలా ప్రతిచోట కూడా ఒకే బాబా సత్సంగం, ఒకే మాస్టరుగారి శిష్యులు అనేక రకాలుగా విడిపోయి, ఏ గ్రూపుకు ఆ గ్రూపు అయ్యి, మా గ్రూపుకంటే ఆ గ్రూపులో బాగా చేశారా? మనమెంత బాగా చేశాం. వాళ్ళెంత తక్కువగా చేశారు. దీన్లో మనం ఎంతమందిని పిలుచుకొచ్చాము, దాన్లో అంత మందిని వాళ్ళు పిలుచుకొచ్చారా? వాళ్ల కంటే మనకు ఎక్కువమంది మందీ మార్బలం, అంటే భక్తులు, వున్నారు. అంటే ఒక రకంగా రాజకీయ ఎలక్షన్స్‌లాగా ఒక్కొక్క చోట తయారవుతున్నది. అన్ని చోట్ల అని నేను చెప్పలేను చెప్పడం లేదుకూడా. చాలా చోట్ల పెద్ద పెద్ద రాజకీయాలు జరుగుతున్నట్టుగా, మన ప్రజారాజ్యంలో ఎలా అయితే రాజకీయాలు జరుగుతున్నాయో, అలాంటి రాజకీయాలు మన సత్సంగాలలో కూడా జరుగుతున్నాయి. ఇదేనా మాస్టరుగారు ఆశించినది? అని మనం కొంచెం ఆలోచించాలి.

మాస్టరుగారు ఆశించిందది కాదు. ఆయన అందరం కలిసి బాగుపడదాం అని ఆలోచించారు. సత్సంగం అంటే అందరూ కలిసి బాగుపడటం. అందరూ విడిపోయి బాగుపడకుండా వుండటం కాదు. విడిపోతే బాగుపడమా అంటారేమో! విడిపోవటమే బాగుపడక పోవటం. ఒకళ్ళకొకళ్ళకి సంబంధం లేకపోవడమే బాగుపడక పోవటం. ఇంట్లో ఒకళ్ళకి ఒకళ్ళకి సంబంధం లేకపోతే ఆ ఇల్లు ఎలా వుంటుందో చెప్పండి. ఒకళ్ళకొకళ్ళకి ఇంట్లో సంబంధం లేదు. తండ్రి మాట కొడుకు వినడు, కొడుకు మాట తండ్రి పట్టించుకోడు. పిల్లల మాట తల్లిదండ్రులు పట్టించుకోరు, వాళ్ల మాట వీళ్లు వినరు. భార్యాభర్తలు యిద్దరికీ తగువులు, ఇక ఆ ఇల్లు ఎలా వుంటుంది? ఆ ఇల్లు సమన్వయమైన కుటుంబమేనా? సరైన కుటుంబమేనా? అలాగే మన సత్సంగం. సత్సంగం అంటే ఏమిటంటే 'సాయి భక్త కుటుంబము'. ఈ సాయి భక్త కుటుంబం, సాయి బిడ్డలనుకుందాము పోని, ఎలా వుండాలి? అందరూ కలిసి ఒక మాట మీదుగా వెళ్లాలి. ఒకళ్ళ మాటను ఒకరు గౌరవించుకుంటూ, ఏది మంచిదనేది ఆలోచించుకుంటూ, ఎట్లా చేస్తే మనందరమూ కలిసి చక్కగా చేసుకుంటాము అనేది ఆలోచించుకుంటూ సత్సంగాలు చేసుకుంటూ పోవాలి.

ఒకరి బలహీనతను ఒకరు సరిదిద్దుకుంటూ పోవాలి. సరిదిద్దుకుంటూపోతూ మనలో మనం మార్పు తెచ్చుకుంటూ పోవాలి. మనకి కోపం వచ్చినట్టే వాడికి వస్తున్నది. మనకీ కోపం వస్తున్నది కదా అనుకున్నప్పుడు పక్కవాడి కోపాన్ని మనం చాలా తేలికగా తీసుకుంటాం. అట్లా కాకుండా

వాడు నామీద ఎందుకు కోపంగా వుండాలి? వాడికదేనా మాస్టరుగారు చెప్పింది? 'ఎంత శాంతం ఆయనకి' అంటారనమాట. ఆయనకెంత శాంతమో అదిసరే, మనకెంత శాంతముండాలో మనం చూసుకోవాలి. ఆయనకెంత శాంతం వుందో వాడికి తెలీదనుకుందాం పోనీ. వాడికి తెలియక ఎగిరెగిరి పడుతున్నాడు. మరి ఆ విషయం మనకు తెలుసు కదా! మాస్టరుగారు శాంతి స్వరూపులని, మనం నేర్చుకోవాలని మనకు తెలుసు కదా! ఎందుకు నేర్చుకోలేక పోతున్నాం? వాడిమీద మనకెందుకు కోపం వస్తున్నది? అనేది ఆలోచించుకుంటే మనం బాగుపడతాం.

ఒకళ్లు బాగుపడ్డారా లేదా అనేది కాదు. మాస్టరుగారు ఒకచోట స్పష్టంగా రాస్తారు. ఈ సత్సంగాల్లో జరిగేటటువంటి లోపం ఏంటంటే ఇతరుల యొక్క బలహీనతలను గుర్తించటము, వాళ్లకి చెప్పటము. 'ఏమిటండీ మాస్టరుగారు యిట్లాగే చెప్పారా?' అంటారన్నమాట. ఇట్లా కాదండి చెప్పింది. వాడు వినటం లేదు, పోనీ వాడు బాగుపడడు. వాడికి చెప్పరాదా అంటారు. మనం ఇద్దరిని గనుక కూర్చోబెట్టి ఒరే నువ్వూరుకోరా. పోనీ నువ్వూరుకోమ్మా తల్లీ, ఆమె అట్లాంటిదే అనుకో గయ్యాళి అనుకో.. నువ్వు ఊరుకో అంటే, :ఆ మాట ఆమెకే చెప్పొచ్చుగా, నాకెందుకు చెబుతారు?' అంటారు. ఎందుకు చెబుతారు? ఆమె బాగుపడదు. నువ్వు కూడా బాగుపడవా? అంటే నేను బాగుపడను. ఆమెను బాగు పరుస్తే బాగుపరచు నీకు శక్తి ఉంటే. అదీ ఉద్దేశ్యం. నీకు శక్తి వుంటే అవతల వాళ్ళని బాగు పరచవయ్యా. నాది తప్పంటావేమిటి. ఆమె మాట్లాడితే ఆమె అట్లాగే అంటుంది అంటూ సపోర్ట్ చేస్తావేమిటి? నీకేమైనా ఎక్కువ దక్షిణ యిచ్చిందో ఏమి పాడో అనుకుంటారు. 'పెద్ద పట్టుచీర పెట్టినట్టుంది అందుకని ఆమెకి సపోర్టు చేస్తున్నారు' అని అనుకుంటారు. మాస్టరుగారు వున్న దగ్గర నుంచీ వచ్చిన గొడవలే యివన్నీ! మాస్టారు కాబట్టి భరించారు అది వేరే సంగతి. వాళ్ల దోవన వాళ్లు వెళ్లిపోతూ వుంటారు వీళ్లని తిట్టుకుంటూ అంతే. అట్లా ఉంటుందన్నమాట. అంతేగాని, చెప్పేవాళ్లు మాస్టరుగారుకదా. మనకు చెప్పారు గదా మనమాచరిద్దాం అనుకోరు.. వాడికెందుకు చెప్పలేదు. సరే వాడు భ్రష్టుడవుతాడు. నువ్వు కూడా అవుతావా? అవుతాను గానీ నేను మటుకు మారను. వాడిని మార్చండి ముందు తర్వాత నేను బాగుపడటం సంగతి చూస్తా అంటాడు. మన సత్సంగాలు అలా వుంటున్నాయి.

అందుకని సత్సంగాల్లో మాస్టరుగారు చెప్పిందేమిటి? ఆయన ప్రబోధామృతములో ఎలా చెప్పారు? ప్రతి సత్సంగం వాళ్ళూ, సత్సంగము-భజన అనేటటువంటి పుస్తకం తీసుకుని దానిలో ఎటువంటి లోపాలు మనలో వస్తాయనేది ఆలోచించుకుని సత్సంగం చేస్తే మనం కొద్దిగా మాస్టరుగారు యిష్టపడే రీతిన ప్రవర్తిస్తున్నట్టు లెక్క.

అలాగే పెద్ద పెద్ద అన్నదానాలు. చాలా చాలా ఖర్చు పెడుతున్నారు, అన్నదానాలు చేస్తున్నారు, ఇంకా వస్త్ర దానాలు చేస్తున్నారు, ఇంకా ఏమిటేంటో చేస్తున్నారు. ఎన్ని చేసినా కూడా మనకు కావలసినదేమిటంటే మనలోనున్నటువంటి సత్వగుణం పెరగటం. అదొక్కటే చూసుకోవాలి. అక్కడా మళ్లీ తేడాలొస్తున్నాయి. అన్నదానం చేసే చోటుకి నలుగురు వెడితే నలుగురిలో విభేదాలొస్తున్నాయి. నేను ముందంటే నేను ముందని, లేకపోతే ఒకడు ఫోటోలు తీసుకునే చోట నేను నిలబడాలంటే, ఇంకొకడికి ఇంకోచోట నన్ను నిలబెట్టలేదని బాధ. అంటే బృందం వెళతారు ఫోటోలు దిగుతారు. ఎందుకంటే పత్రికలో వేయాలి, ఏదో చూపించుకోవాలిగా. ఇది గుప్త దానమనేది కాదు ప్రస్తుతం. గుప్తదానమనేది లుప్తమైపోయింది.

కాబట్టి ఇప్పుడు ఆడంబర దానాలు ఎక్కువైనాయి. కాబట్టి మా సంస్థ చేసింది యిట్లా. ఆ ఫోటోలు దిగాలి. బావుంది. సంస్థ తరపున చేస్తున్నారు. సంస్థకి దానాలు యిస్తున్నారు. చాలామంది దాతలు యిస్తున్నారు డబ్బులు. ఈ సంస్థలకు వెళ్లే వాళ్లు వెళతారు. ఒక అనాథ శరణాలయానికి వెళతారు. వెళ్ళిన తర్వాత అక్కడ సంస్థకి కావలసిన ప్రచారం కావాలికదా! కాబట్టి ఫోటోలు తప్పకుండా తీసుకోవాలి. వీడియోలు కూడా తీసుకోవాలి. అక్కడ వస్తుంది మళ్ళీ క్లాష్. ఎవరు ముందు దిగాలి ఫోటో. నన్ను దింపలేదని వాడే దిగాడని ఇంకొకళ్ళు. ఇట్లా అన్నమాట. ఇట్లా యిచ్చేటప్పుడు ఫోటోలు కావాలి. ఫోటో ఎవరికీ తెలియదు. ఎవరో ఏదో సంస్థవారు వేశారు బ్యానరు చూశాము. ఆ మనిషి మనకేం తెలుస్తుంది. అసలు తెలీదు. సంస్థ వారు చేశారన్నదొక్కటే గుర్తుంటుంది. కానీ దగ్గర వాళ్లకి తెలియాలి. నేనిచ్చాననేటటువంటి లోపల గొప్పతనమనేటటువంటి భావన, చూసేవాళ్ళు గొప్పగా అనుకోవాలి.. మనం ఎవరో తెలియని వాళ్లు ఏమీ అనుకోరు. వాళ్ళెవరో మనకు తెలియదు. అనామకులు. ఎవరైనా ఒక్కటే. కానీ తెలిసిన వాళ్లకి ఫలాన వాళ్ళండి. చూశారా ఎట్టా యిస్తున్నదో! అనుకోవాలి. అలా అనుకుంటే మనకు తృప్తి. అంటే ఏమిటన్నమాట లోపల సన్నగా కీర్తికాంక్ష. అది వాళ్లకూ తెలియదు. అది మనకీ తెలియదు. ఆ చిన్న

కీర్తికాంక్ష అభివృద్ధియై వ్రేళ్ళూనుకొని రానురాను అది వృక్షమై విభేదాలకు దారితీసి... అయిపోయిందిక. నేనీసారి వేరేపోతా అంటారు. వేరే పోవటమే ఇంక. వేరే కాపురం పెట్టినట్టే లెక్క. అలా అవుతున్న దన్నమాట. అక్కడ తేడాలు వస్తున్నాయి. ప్రతిచోట మాస్టరుగారు ఏవైతే చెప్పారో, ఏవైతే చెయ్యవద్దు అని చాలాసార్లు ఆయన ఊపిరి వున్నంతవరకు ప్రాకులాడరో, ఎటువంటి భావాలైతే ప్రజల్లో రాకూడదు, బాబా భక్తుల్లో రాకూడదు, బాబా చెప్పినదాన్ని ఎట్లా ఆచరించాలి, ఎలా ఉండాలి అనేదాని కోసం ప్రాకులాడారో అది తప్ప మిగతావన్నీ జరుగుతున్నాయి చాలా చోట్ల.

మహాత్మాగాంధీ గనుక స్వాతంత్ర్యం వచ్చినప్పుడు ఎలా వుండాలి భారతదేశం అని అనుకున్నారో, దానికి వ్యతిరేకంగా మనం ఎట్లా వుంటున్నామో మన దేశం ఎలా వుంటోందో! అలాగే మాస్టరుగారు ఆశించిన సత్సంగాలు గాని, మాస్టరు గారాశించిన అన్నదానాలు గానీ, మాస్టరు గారు ఆశించిన మరి ఏ కార్యక్రమాలైనాసరే అలా జరుగుతున్నాయో లేదో కొంచెం ఆలోచించండి. ఆలోచించి మార్పు తెచ్చుకోవడానికి ప్రయత్నం చేయండి. ఆయన కోరేది ఈ ఆర్భాటాలు కాదు. అట్లానే ఆర్భాటాలు చేయకూడదు అని కాదు. బాబాకూడా కోరలేదు. కానీ మనం హాయిగా చేసుకుంటున్నాం. బాబా కెన్నో కిరీటాలు, వజ్రకిరీటాలు కూడా అర్పిస్తున్నాం. మన సంతోషానికి అది చిహ్నం. తండ్రికి మనం అర్పించుకునేటటువంటి కానుకలు అవి. అయన ఇచ్చిన దాంట్లో ఎంతోకొంత మనం సమర్పించుకోవాల్సిందే తప్పదు. కానీ ఆయన కోరేదాన్ని కూడా మనం తప్పకుండా సమర్పించుకోవాలి. ఆయన కోరే దేమిటంటే సాటి మనిషితో సమన్వయంగా వుండటం. ప్రతిదానిలోనూ మన భావాలు సరిదిద్దుకోవటం. సత్వగుణాన్ని మనం పెంపొందించుకోవటం. అందరం కలిసి మెలిసి జీవించటం.

అందరం కలిసి జీవించినప్పుడు దానికి ఎంతటి బలం ఉంటుందో స్వాతంత్ర పోరాటంలోనే మనం చూడవచ్చు. ఒక్క గడ్డిపోచ లాంటి, సన్నటి ఆయన ఎక్కడో దక్షిణాఫ్రికాలో ఉండి స్వతంత్ర్య ఉద్యమాన్ని చేపట్టాడు. ఆ రోజు ఆయన్ని విసిరి అవతల పడేశారు, తన్నారు. కానీ ఆయన పట్టుదల, ఆయన కార్యదీక్ష, ఆయనలో వున్నటువంటి సద్గుణాలు దేశం మొత్తాన్ని కుదిపి పారేసినాయి. ఎవరంటే వాళ్లు వెళ్లిపోతాం తీసుకుపోండి అనే వాళ్లట, జైలుకు పంపిస్తామంటే! పద, నువ్వు తీసుకెళ్ళటమేమిటి జైలుకి మేమే వస్తున్నాం అనేటటువంటి ఊపు ఎక్కడ నుండి వచ్చింది? ఆయనలో వున్న బలంలోంచి, ఆ సత్యదీక్ష, కార్యదీక్షలోనుంచి. కరెక్టుగా నడిచాడు కాబట్టి ఆయనను అనుసరించారు. కరెక్టుగా నడవని వాళ్లను అనుసరించడం లేదా అనకండి వాళ్లనీ అనుసరిస్తున్నారు. కానీ ఆ అనుసరణ ఎట్లాంటి వైపుకు దారితీస్తుంది. రెండువందల ఏళ్లు పాలించిన ఆ బ్రిటిషు సామ్రాజ్యాన్ని సునాయాసంగా వెళ్లగొట్టగలిగాం. సునాయాసమంటే వాళ్లంతట వాళ్లే వెళ్లిపోయినారు. మనమేం తుపాకులు పట్టుకోలేదు. వాళ్ళు తుపాకులు పట్టుకుని కూడా మనల్ని ఏమీ చేయలేకపోయారు. మనం ఏమీ తుపాకులు పట్టుకోక పోయినా వాళ్ళని వెళ్లగొట్టగలిగాం. అది సత్యమార్గం అంటే! అదీ సమన్వయం అంటే. ఏకతాటి మీద నిలబడడం అంటే.

అలా ఒక తాటి మీద బాబా భక్తులం అందరం, మాస్టరుగారి భక్తులం అందరం, బిడ్డలం అందరం నడవాలి. అలా నడిచినప్పుడు ఈ సమాజం బాగుపడుతుంది. అట్లా చేసినప్పుడు మాత్రమే మనం మాస్టరుగారికి యిష్టమైనట్లు ప్రవర్తించినట్లు లెక్క. పూజలు చేస్తే సంతోషపడరా అంటే తప్పకుండా పడతారు. కానీ మాట వినని వాడితో అసంతృప్తి లోపల వుంటుంది తప్పకుండా. ఒక తండ్రికి పూజ చేస్తున్నాడు పిల్లవాడు నువ్వెంత గొప్పవాడవని, కానీ మాట వినడనుకోండి చాలా బాధ లోపల వుంటుంది. పూజ చేసినందుకు సంతోషమే. కానీ మాట వినటంలేదే, వీడు చెడిపోతున్నాడే అనిపిస్తూ చాలా బాధపడుతుంటారు వాళ్ళు. అందుకని ఆ బాధపెట్టేటటువంటి బిడ్డలుగా మనం ఎప్పుడూ వుండకూడదు. మనం ఆయనని సంతోషపరిచేటటువంటి వాళ్లుగా వుండాలి. అలాంటి గుణాల్ని, అలాంటి సమన్వయాన్ని మనం ఎప్పుడూ అలవర్చుకోవాలి. అట్లా అలవర్చుకునేటటువంటి శక్తిని, బోధని అన్ని పుస్తకాలలోనూ మాస్టరుగారిచ్చారు. బాబా సూక్తులుగా చెప్పారు. ఆ సూక్తులు ఆచరించడం కూడా మనకి అంత లోతుగా తెలియదు. కాబట్టి ప్రబోధామృతంలో మాస్టరుగారు ఆ సూక్తులకు వివరణ యిస్తూ ఎలా ఆచరించాలో చెప్పారు. దానిని మెల్లమెల్లగా మనం చదువుతూ దాన్ని అర్థం చేసుకుంటూ ఆ రకంగా నడవాలని అట్టి శక్తిని ప్రసాదించాలని సాయిబాబాని, పూజ్యశ్రీ మాస్టరుగారిని ప్రార్థిస్తున్నాను.

జై సాయిమాస్టర్!

# మాతృదేవి స్మృతులు

**శ్రీ పూర్ణచంద్రరావు**

మన గురుపత్ని పూజ్యశ్రీ అలివేలుమంగమ్మతల్లి సమాధి లీలావైభవాన్ని భట్లమాచవరం పోస్టుమాస్టరుగారైన పూర్ణచంద్రరావుగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు –

2021 జూన్ 4 వ తేదీన సాయంత్రం సమయంలో కొన్ని కార్లు, ఒక అంబులెన్సు మా గ్రామం మీదుగా వెళ్లడం అందరూ చూశారు. అది కరోనా సమయం. ఎవరికీ ఏమీ అర్థం కాలేదు. నేను 10 సంవత్సరాలుగా అక్కడకి ప్రతి ఉదయమూ వ్యాహ్యాళికి వెళ్ళేవాడిని. కానీ మరునాడు నేను వెళ్ళలేదు. ముందురోజు ఏం జరిగిందో ఎవరికీ తెలియలేదు. నేను వారం రోజులదాకా అటువైపు పోలేదు. కానీ మధ్య మధ్యలో పూజలు జరగటం, అక్కడ కొంతమంది జనాలు వుండటం, మైక్ లో భజనలు, ఆరతులు వినబడటం – ఇవన్నీ చూసి, విని, మావాళ్ళందరూ 'అక్కడకి ఎవరో అమ్మవారు వచ్చారట' అని చెప్పుకున్నారు. నేను అలా దూరంనుంచి చూసి వచ్చేస్తుండేవాడిని.

బహుశా 11వ రోజనుకుంటాను. రాత్రిపూట చాలామంది వచ్చారు. పూజ జరుగుతోంది. అప్పుడు బ్రాహ్మణులకు సంభారాలు, వస్త్రాలు.. అవన్నీ ఇచ్చారు. నేను, నా భార్య అక్కడ ఏం జరుగుతోందో చూద్దామని రాత్రి 9:30 గంటలకు బండి మీద బయలుదేరి పూజ్యశ్రీ అమ్మగారి సన్నిధికి వెళుతున్నాము. అప్పటికి ఆ రోడ్డంతా గతుకులు, రాళ్లతో అస్తవ్యస్తంగా వుంది. మాకు ఎదురుగా ఒక పూజారిగారు బండిమీద మమ్మల్ని దాటివెళుతూ కొంచెం ముందుకి వెళ్ళగానే పడిపోయారు. పెద్ద శబ్దం వచ్చింది. నేను వెంటనే బండి ఆపి ఆయన దగ్గరకు వెళ్లాను. బండి ఒకవైపు, ఆయన ఒకవైపు పడిపోయారు. ఆయనను, బండినీ లేపి నిలబెట్టాను. పడిపోయిన సామానంతా తీస్తుంటే, మా ఆవిడ 25 కిలోల బియ్యం బస్తా లేపి బండి మీద పెట్టింది! నాకు చాలా ఆశ్చర్యం కలిగింది. ఎందుకంటే, ఆమెకు రెండుచేతులూ నొప్పులు. బరువు పట్టుకోలేదు. మరి అలాంటిది, అంత బరువు ఎలా మోసిందో నాకు అర్థం కాలేదు. ఆమెకీ అదే పరిస్థితి. ఆ పూజారిగారికి ఒక్క దెబ్బ కూడా తగలలేదు! అదింకా ఆశ్చర్యం. అప్పుడు నాకు అనిపించింది. 'ఇక్కడ వున్న అమ్మవారు(పూజ్యశ్రీ అమ్మగారు) చాలా శక్తి కలిగినవారు' అని!! ఇక నేను అప్పుడప్పుడు వెళ్లడం మొదలుపెట్టాను.

నేను చాలాకాలంగా గ్యాస్ట్రిక్ సమస్యతో బాధపడుతున్నాను. ఒకరోజు అమ్మవారితో (పూజ్యశ్రీ అమ్మగారితో) నా బాధ చెప్పుకుని తగ్గించమని మొక్కుకున్నాను. ఒక వారంరోజులకల్లా నా బాధ తగ్గిపోయింది! ఇప్పటివరకు మళ్ళీ రాలేదు!! నేను హాయిగా అన్నీ తినగలుగుతున్నాను. 'అమ్మో! అమ్మవారు(పూజ్యశ్రీ అమ్మగారు) చాలా మహాత్మ్యం కలిగినది' అనుకున్నాను.

నేను క్రిందటి సంవత్సరం మే 31 వ తేదీన ఇల్లు కట్టుకుందామని శంకుస్థాపన చేసుకున్నాను. అమ్మవారు (పూజ్యశ్రీ అమ్మగారు) జూన్ 4 వ తేదీన మా ఊరికి వచ్చారు. నా ఇంటి విషయం కూడా అమ్మవారికి(పూజ్యశ్రీ అమ్మగారికి) చెప్పుకున్నాను. నాకు ఏ అడ్డంకులూ రాకుండా, ధనపరమైన సమస్యలు లేకుండా, ఆలస్యం కాకుండా ఇల్లు పూర్తవ్వాలని ప్రార్థించాను. చాలా ఆశ్చర్యంగా ఎటువంటి ఇబ్బంది లేకుండా ఇల్లు పూర్తయింది!! నా దగ్గర డబ్బులు తీసుకున్న

వాళ్ళు, నేను మర్చిపోయినా, నాకు వాళ్ళంతట వాళ్ళే తెచ్చి ఇచ్చారు! రావనుకున్న డబ్బులు వచ్చాయి! 25 లక్షలు పెట్టి కట్టుకున్నాను. ఒక్కరూపాయి కూడా అప్పు తీసుకోవలసిన అవసరం రాలేదు! సరిగ్గా 9 నెలలకు ఇల్లు పూర్తయ్యింది! గృహప్రవేశం చేసుకున్నప్పుడు కూడా ముందుగా పూజ్యశ్రీ అమ్మగారికి చెప్పి, అప్పుడు మిగిలినవాళ్లకి చెప్పాను.

నాకు పూజ్యశ్రీ అమ్మగారి దగ్గరికి వచ్చాక చాలా బాగుంది. మనసుకు కూడా చాలా ప్రశాంతంగా వుంది. నాకు మధ్యాహ్న సమయానికి డ్యూటీ అయిపోతుంది. సాయంత్రం స్నానం చేసి సన్నిధికే వచ్చి కూర్చుంటాను. ఇంక ఎక్కడికీ వెళ్లాలనిపించడం లేదు.

ఇదివరకు మేము ఒంగోలులో బాబా గుడికి వెళ్ళినప్పుడు ఒకరు శ్రీ సాయిలీలామృతం గ్రంథం ఇచ్చారు. దాన్ని ఒక పక్కన పెట్టాము. ఎన్నిసార్లు బాబా గుడికి వెళ్లినా పూజ్యశ్రీ మాస్టరుగారి సమాధి వుందని నాకు తెలియదు. ఇక్కడికి పూజ్యశ్రీ అమ్మగారు వచ్చాక నా భార్య ఆ విషయం చెప్పింది.

మేము ఇల్లుకట్టుకునేటప్పుడు ఇంటి కొలతల కోసం ఒకాయన వస్తానని చెప్పి ఆలస్యం చేస్తున్నాడు. ఒకరోజు మా అమ్మ పడుకుని బాబా చరిత్ర తీసి చదవడం మొదలుపెట్టింది. కాసేపటికి అతను ఫోన్ చేసి కొలతల కోసం వస్తున్నానని చెప్పాడు! మాకు చాలా ఆశ్చర్యం వేసింది. ఇప్పుడిప్పుడే వారిగురించి అర్ధమవుతోంది. ఏది ఏమైనా ఎక్కడో దూరాన్నించి మాకోసం పూజ్యశ్రీ అమ్మగారు ఇక్కడకి వచ్చారని మా చుట్టుపక్కల గ్రామస్థులందరికీ నమ్మకం.

అమ్మవారు(పూజ్యశ్రీ అమ్మగారు) వచ్చిన దగ్గరనుంచి అందరికీ అన్నివిధాలా బాగుందని అందరూ సంతోషంగా వున్నారు. మేమందరం శ్రద్ధగా పూజ్యశ్రీ అమ్మగారిని సేవించుకోవాలని మనస్ఫూర్తిగా కోరుకుంటూ నమస్కరిస్తున్నాను.

ఓం భక్తిప్రదాయై నమః!

## సాయిబాబాను పూజిస్తే కోరికలు తీరుతాయా ?

03వ పేజీ తరువాయి

యొక్క ఆశయం ప్రక్కదారి పట్టిన జీవులను దండనతోనైనా సంస్కరించడమే. కనుక చేసిన నేరానికి శిక్షననుభవించే వారిలో ఆత్మ సంస్కరణ ప్రోత్సహించడానికి ఎరగా శిక్షలో కొంత సడలింపు వుండాలి. అదే సాయి మొదట కోరిన వెంటనే సాధ్యమైనంతగా కోరికలు నెరవేర్చడము, కష్టాలు తీర్చడమున్నూ, కాని దానిని అవకాశంగా అదేపనిగా వినియోగించుకోజూస్తే ఆ లక్ష్యాన్ని చెరచేది గనుక చెల్లదు. ఆయన యిది వరకు యీ జన్మలో గాని, క్రిందటి జన్మలోగాని యిలాంటి ప్రోత్సాహమిస్తే దానిని స్వీకరించి, ఆయన సాధింపజూచిన సంస్కరణ మనలో రానపుడు మనకా శిక్ష పడుతుంది.అవేయీ తీరనికష్టాలు.పసిపిల్లలు తమఅయిష్టాన్ని ఆశ వల్లనైనా అతిక్రమించి బడికి వెళ్ళి విద్యనేర్చుకోవాలని మనం వారికి కొనుక్కుతినేందుకు డబ్బులిస్తాము. కాని పిల్లలు కొనుక్కుతిని చదువుమాత్రం ఎగవేస్తే వారిని మనం ఒకటి రెండుసార్లు హెచ్చరిస్తాము, క్షమిస్తాము. కాని ఆపైన కొనుక్కోడానికి డబ్బులివ్వడం మానుతాము. బడిలో దండన పొందనిస్తాము. మన విషయమూ అంతే. అందుకే సాయి తప్పుచేస్తున్న ఒక భక్తుడితో "నేనొకసారి హెచ్చరిస్తాను. అంతకూ నువ్వు వినకపోతే నీ కర్మకు నిన్ను విడిచి పెడతాను" అన్నారు. కష్టాలు, కోరికలు సాయిని కొల్చినా తీరని వారమంతా యీ తెగకు చెందినవారమేనని గుర్తించాలి. అప్పుడొక్కటే శరణ్యం. ఆయన పరమ కారుణ్యమూర్తియని గుర్తించి, వల్లగాని తప్పుచేసిన దానికి న్యాయబద్ధంగా మనం శిక్షననుభవిస్తున్నామని గుర్తించి ఓరిమితో కర్మఫలాన్ని అనుభవించడమే. డా॥పిళ్ళేగారికి నారికురుపు వచ్చినపుడు సాయి చెప్పినట్లు, అలా విధేయుడై, పశ్చాత్తాపుడైన నేరస్థునికి యిప్పుడే న్యాయనిర్ణేత కనికరించి శిక్షను తగ్గించవచ్చు. అది హక్కు మాత్రంగాదు, అనుగ్రహము మాత్రమే. మనను మనం సంస్కరించుకొంటూ, ధర్మబద్ధమైన శిక్షనంగీకరించగలితే మాత్రమే అట్టి దయ లభిస్తుంది. ఇదీ సాయి కోరిన ఓరిమియన్న దక్షిణ. ●

# మాతృదేవి సన్నిధిలో గురుపూర్ణిమ

శ్రీమతి టి. పద్మావతి

*"గురుమధ్యే స్థితం విశ్వం విశ్వమధ్యే స్థితో గురుః*
*గురుర్విశ్వం నచాన్యోస్తి తస్మై శ్రీ గురవేనమః"*

అన్న గురుగీత లోని ఒక శ్లోకంతో పూజ్య గురుదేవులు ఆచార్య శ్రీ భరద్వాజ గారు తమ సత్సంగాలను ప్రారంభించేవారు. ఈ విశ్వం అంతా గురుస్వరూపమని అందులోని భావం. చాలా సంప్రదాయాల్లో, ఈ గురుపూర్ణిమ రోజున గురువుని పూజించే ఆచారం ఈనాటికీ ఉంది. సాక్షాత్ దత్తావతారమైన శిరిడీ సాయినాథులవారు తమ భక్తులని చేసుకొమ్మని చెప్పిన ఉత్సవం గురు పూర్ణిమ. దీనిని వ్యాసపూర్ణిమ అనికూడా అంటారు.

ఇంత విశిష్టమైన పర్వదినం, ఒంగోలు సమీపానగల గుమ్మళంపాడు గ్రామశివారులో కొలువైయున్న మాతృదేవి దివ్యసన్నిధిలో అత్యంత భక్తిశ్రద్ధలతో జరిగింది. ఆ శుభ దినాన త్రిమూర్తి స్వరూపాలైన పూజ్యశ్రీ బాబా, మాస్టరుగారు, అమ్మగార్లను సర్వాంగ సుందరంగా అలంకరించారు. వేకువ ఝామునే ముగ్గురు మూర్తులకు మేలుకొలుపుతో గురుపూర్ణిమ మహోత్సవం మొదలయ్యింది. అనంతరం ప్రత్యేక మంగళస్నానాలు, దివ్య జనని సమాధికి ప్రత్యేక అలంకరణ జరిగాక, గురుపుత్రులు శ్రీ ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ గారు షోడశోపచారపూజ చేశారు. అనంతరం గురుపూర్ణిమ సందర్భంగా, శ్రీ ద్వారకబాబుగారు సత్సంగం చేసారు.

ముందుగా పూజ్య గురుదేవులైన అమ్మగారి, మాస్టరుగారి పాదపద్మములకు శతకోటి నమస్కారములు; సమర్థ సద్గురుడు, పరిపూర్ణ దత్తావతారమైన శిరిడి సాయినాథులవారికి శత సహస్ర కోటి నమస్కారాలు తెలియచేసి వారు సత్సంగాన్ని ప్రారంభించారు.

"ఈ గురుపూర్ణిమ రోజుని "వ్యాస మహర్షి పుట్టినరోజు", వారు "జగద్గురువైన రోజు" అని కూడా అంటారు. అటువంటి వ్యాస మహర్షి గురించి ఒకసారి స్మరించుకుందాం. బ్రహ్మదేవుడు యీ సృష్టిని 'ఏ సూత్రాల ఆధారంగా చేయాలి?' అని ఆలోచిస్తూ, వేదాలన్నింటినీ స్మరిస్తూ, దీన్ని నడపడానికి తనలాంటివాడిని ఒకడిని సృష్టించాడట. అతని కార్యక్రమం ఏమిటంటే,,, మనం మాట్లాడుతున్నప్పుడు ఆ మాటలు సరిగ్గా వచ్చాయో లేదో అని చూసే తత్త్వం మనలో ఒకటుంటుంది. అంటే మన మనస్సు ఏదైనా పనిచేస్తున్నప్పుడు అది రెండుగా విభజింపబడి ఆ పని బాగా చేసే భాగం ఒకటైతే, దాన్ని బాగాచేస్తోందా లేదా అని చూసే భాగం యింకొకటి వుంటుంది. ఉదాహరణకి ఒక చిత్రకారుడు చక్కటి చిత్రం వేస్తూ మధ్యలో ఆగి బాగా వస్తోందా లేదా అని చూసుకుంటూ వుంటాడు. ఇలా ప్రతీ పనిలోనూ జరుగుతుంది. ఇలా బ్రహ్మచే సృష్టింపబడిన అతడు ప్రతిదానిని పర్యవేక్షిస్తూ వుంటాడు. అతనికి బ్రహ్మదేవుడు 'అపాంతరతపుడు' అని నామకరణం చేశాడు. ఈయన బ్రహ్మదేవుడికి ప్రతిరూపమే కనుక బ్రహ్మదేవుడికి

వున్న వేదము, జ్ఞానము ఈయనకి కూడా పరిపూర్ణంగా వుంది. ఈయన ప్రతి యుగంలో ఈ సృష్టి ప్రణాళిక ప్రకారం జరుగుతుందా లేదా అని గమనిస్తూవుంటాడు.

ఈయన యిలా చేస్తూ వుండటాన్ని విష్ణుమూర్తి గమనించి మెచ్చుకుని "ప్రతియుగంలో ఈ సృష్టిలో వచ్చే సవ్యాపసవ్యాలని జాగ్రత్రగా పర్యవేక్షిస్తూ 'స్థితి కారకుడిగా' వున్నావు కనుక నువ్వు బ్రహ్మకే కాదు, నాకూ ప్రతి రూపానివే, అందువల్ల నీకు 'వ్యాసుడు' అని నామకరణం చేస్తున్నాను" అన్నాడు. ఇలా వ్యాసమహర్షి ప్రతి యుగంలోనూ అవతరిస్తున్నాడు.

ద్వాపరయుగంలో అపాంతరతపుడు సత్యవతి గర్భాన అవతరించాడు. శంతన మహారాజు తరవాత వంశం అంతరించి పోయే పరిస్థితి రావడం వల్ల, సత్యవతీ దేవి ఆజ్ఞ మేరకు, వ్యాసుడు ఆ వంశం కొనసాగించేలా చేయడంలో ప్రధాన పాత్ర వహించి ధృతరాష్ట్రుడు, పాండురాజు, విదురుడు ల పుట్టుకకు కారకుడు కూడా అయ్యాడు. ఇలా యీ యుగం కొనసాగి చివరికి కురుపాండవ యుద్ధం జరిగి కొన్నాళ్ళకి యుగాంతం అయ్యేదశలో తన వేద జ్ఞానాన్నంతటిని తనలో యిముడ్చుకుని మళ్లీ అవసరమైనప్పుడు వ్యాప్తి చేయడానికి నిక్షిప్తం చేసుకున్నాడు.. సృష్టి అంతంలో శివుడు కూడా, మిగిలిన బీజాలన్నింటినీ(జీవులన్నింటినీ) తనలో దాచుకుని మళ్లీ పునఃసృష్టి చేసినపుడు వీటన్నింటినీ బ్రహ్మగారికి అప్పచెబుతాడు. వ్యాసుడు కూడా యీవిధంగా చేయడాన్ని గమనించిన శివుడు, "నీకూ నాకూ భేదం లేదు" అన్నాడు. కనుక బ్రహ్మ విష్ణు మహేశ్వరుల కార్యాన్ని తనలో ఇముడ్చుకుని ఈ సృష్టి కార్యానికి తోడ్పడటం వల్ల ఇతన్ని 'దత్తుడు' అని, 'వేదవ్యాసుడు' అని, 'జగద్గురువు' అని అనడం వల్ల ఈ పూర్ణిమకి వ్యాసపూర్ణిమ, గురుపూర్ణిమ అని పేరు వచ్చింది. గురుపూర్ణిమ, దత్తజయంతి విడివిడిగా వుండటం ఒక చిత్రం. దత్తుడిలో ఏ తత్వం అయితే వుందో అది వ్యాసుడిలో కూడా వ్యక్తమైంది కనుక వ్యాసుడిని దత్తవతారం అనవచ్చు.

వేదవ్యాసుడు ఒకసారి యజ్ఞం చేద్దామని మొదలుపెట్టాడు. అరణి తో నిప్పు తయారు చేస్తున్నాడు. దీనిలో కట్టెలు, నెయ్యి వేసి హోమం చేస్తున్నాడు. ఈయనకి ఒక ఆలోచన మెరిసింది. హోమంలో, కట్టెల వల్ల అగ్ని



పుడుతోందా, నెయ్యి వేయడం వల్ల అగ్ని పడుతోందా, ఈ రెండింటి వల్లా అగ్ని పుట్టిందా? నెయ్యి ముందా, కట్టె ముందా, నిప్పు ముందా ?అని! ప్రపంచంలో అందరికీ కట్టెలు పెట్టి, దానిమీద నెయ్యి వేసి, చివర నిప్పు వెలిగించినట్టు ఉంటుంది. కానీ ఇంకొక వైపు నెయ్యి ఎలా వచ్చింది అని ఆలోచిస్తే , ముందు సూర్య రశ్మి నించి గడ్డిమొలిచి, దాన్ని ఆవు మేసి, దానినించి పాలు,పెరుగు, వెన్న, నెయ్యి వస్తాయి. అంటే కారణం ముందు సూర్యుడు అనే అగ్ని,,, అలాగే మనిషి శరీరం కట్టెలాంటిది, ఆయుర్దాయం నెయ్యిలాంటిది, అందులో ప్రకటమయ్యే భగవత్ తత్వం అగ్ని లాంటిది. అందరికి మనిషి, ఆయుర్దాయం కనిపిస్తుంది. కానీ అందులో అంతర్లీనంగా ఉన్న ప్రజ్ఞ కనిపించదు. ఈ భగవత్ తత్వమనే ప్రజ్ఞ లేకపోతే మనిషికి మనుగడ ఉండదు. ఇలా రెండు రకాల తత్వాలతో ఉన్న ఆలోచనా ప్రవాహానికి ఒక పేరు ఉంది, దాని పేరు 'ఘృతాచీ' అనే అప్సరస. ఇటువంటి ఆలోచనా స్రవంతితో వ్యాసుడి ప్రజ్ఞ కలిసి 5 సంవత్సరముల వయసున్న బాలుడిగా ప్రత్యక్షమయ్యింది. పరిపూర్ణమైన గురువుకి సాటిలేని పరిపూర్ణుడు పుట్టాడు. ఆయన పేరు శుకుడు. ప్రతి ఒక్కరూ మహాత్ములు అవడమే శుక మహర్షి జననం. ఆయుర్దాయం అనే నెయ్యి, శరీరం అనే కట్టె, ప్రజ్ఞ అనే నిప్పు యజ్ఞ రూపం ధరించినప్పుడు మనలో శుక మహర్షి జననం జరుగుతుంది. మనల్ని అలా తయారుచేస్తాడు కనుక, వ్యాసుడికి పరిపూర్ణులైన వాళ్ళందరూ వారి బిడ్డడైన శుకమహర్షి స్వరూపాలు. ఇదే దత్త సంప్రదాయంలో కూడా, దత్తుడు ప్రతివారినీ ఉద్ధరించి మహనీయులుగా తీర్చిదిద్దుతాడు. దీని ప్రకారం మనకి

***మిగతా 26వ పేజీలో***

# వార్తాలాపము

(గత సంచిక తరువాయి)

**శ్రీమతి అడిదం వేదవతి**

**శ్రీ ప్రకాశానంద స్వామివారిచే విరచితమైన వార్తాలాపమనే యీ గ్రంథము గ్రాంథికభాషలో వ్రాయబడి వుండటం వలన తమకు అర్థంగావడం లేదని చాలామంది పాఠకులు అభిప్రాయాన్ని వ్యక్తపరిచారు. అందుకని పాఠకుల అభ్యర్థన మేరకు పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజగారి ప్రియపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు సరళమైన భాషలో ఈ గ్రంథాన్ని పాఠకులకు అందజేస్తున్నారు - ఎడిటర్.**

## 14వ ప్రసంగము

రెండోరోజు ప్రసంగం ప్రారంభం అవగానే రాఘవజీ భాయి ఇలా అడిగాడు:- నేను పుస్తకాలు చాలా చదివాను. కానీ నాకు అనుభవం కలగడం లేదు. కారణం ఏమిటి?

శ్రీ ప్రకాశానంద స్వామివారు దీనికి సంబంధించిన దృష్టాంతాన్నిలా చెప్పారు:-

### మూఢుని లక్షణము

ఒక గొర్రెల కాపరి వుండేవాడు. అతడు తన మేకలను, గొర్రెలను కాచుకుంటూ ఒక చిన్న మేకపిల్లను చంకలో పెట్టుకుని అటూ ఇటూ తిరుగుతూ వున్నాడు. సాయంకాలం వరకు అలాగే జరిగింది. మందను ఇంటికి తీసుకువెళ్ళడానికై ఆ చిన్న మేకపిల్ల కోసం అటూ ఇటూ వెదకసాగాడు. కానీ ఎక్కడా కనిపించలేదు. ఆ విధంగానే తిరుగుతూ అతడు నూతి దగ్గరికి వెళ్లి లోపలికి చూసాడు. అతనికి తన చంకనున్న మేకపిల్ల యొక్క ప్రతిబింబం కనిపించింది. అతడిలా అరిచాడు "అందరూ చూడండి! ఇదిగో మేకపిల్ల నూతిలో పడిపోయింది". పక్కనున్న అతని సహచరుడు ఇలా అన్నాడు: "సరిగ్గా చూసుకో! మేకపిల్ల నీ చంకలోనే వున్నది".

ఈ భావాన్ని శంకరులు ఇలా చెప్పారు:

*శ్లో॥ తత్త్వ మాత్మస్థమజ్ఞాత్వా*
*మూఢః శాస్త్రేషు పశ్యతి।*
*గోపః కక్షగతం ఛాగం*
*యథా కూపేషు దుర్మతిః॥*

భావం: తనలోని తత్త్వాన్ని తెలుసుకోలేని మూఢుడు దానిని శాస్త్రాలలో వెతుకుతాడు. చంకలోని మేకపిల్లను గొల్లవాడు నూతిలో చూశాడు కదా!

### బ్రహ్మ విచారం చేత సహజంగా లభించే పరమతత్త్వము

*శ్లో॥ లోకాంతరే వాత్ర గుహాంతరే*
*వా తీర్థాంతరే కర్మపరంపరాంతరే।*
*శాస్త్రాంతరే నాస్త్యనుపశ్యతామిహ*
*స్వయం పరం బ్రహ్మ విచార్యమాణే॥*

భావం: ఆలోచించి చూస్తే పరతత్త్వమైన బ్రహ్మము ఇతర లోకాలలోగాని, గుహలలోగాని, తీర్థాలలోగాని, కర్మకాండలలోగాని, ఇతర శాస్త్రాలలోగాని కనిపించదు. సరిగా చూసిన వారికి తానే బ్రహ్మమని తెలుస్తుంది.

ఆత్మ గోలోకంలోకాని, వైకుంఠంలోగాని, కైలాసంలోగాని లేదు. గంగా మొ॥న నదులలోనూ, ఉపనిషత్తులలోనూ, పురాణాలలోనూ లేదు. యజ్ఞము, దానము, తపస్సు అనే పేర్లతో వ్యవహరించబడే కర్మకాండలయందు కూడా లేదు. ఈ విధంగా విచారించి చూస్తే తానే బ్రహ్మము అనే దృఢ నిశ్చయం కలుగుతుంది. శంకరాచార్యులు మొ॥న వారు ఈ విషయాన్ని ఎంతగానో నొక్కి చెప్పారు. అయినా వృత్తిదోషం వల్ల మానవులు వాస్తవికమైన తత్త్వాన్ని తెలుసుకోలేరు.

## శాస్త్ర ప్రతిపాదితమైన నిజతత్త్వాన్ని తెలుసుకోలేకపోవడం వల్ల కలిగే బాధ

*శ్లో॥ అన్యథా పరమం తత్త్వం*
*జనాః క్లిశ్యంతి చాన్యథా।*
*అన్యథా శాస్త్రసిద్ధాంతో*
*వ్యాఖ్యాం కుర్వంతి చాన్యథా॥*

భావం : పరమతత్త్వము వేరొకటి. మానవులు వేరొక దానిలో శ్రమచేసి బాధపడతారు. శాస్త్ర ప్రతిపాదితమైన సిద్ధాంతము ఒక విధంగా వుంటే దాని అర్థాన్ని మరో విధంగా చెబుతారు.

సత్కర్మ శాస్త్రప్రతిపాదితమౌతూ వేరొక విధంగా వుంటే, అసత్కర్మను (సత్కర్మ కాని దానిని) సత్కర్మగా భావించి ఆచరించే మానవులు కష్టాలను పొందుతారు. వారికి మలదోషము నివృత్తిని పొందదు.

అలాగే సదుపాసన శాస్త్రాలలో ప్రతిపాదించినది ఒక విధంగా వుంటే అసదుపాసనను (సదుపాసన గాని దానిని) సదుపాసనగా భావించి ఉపాసిస్తారు. వారికి క్లేశమే కలుగుతుంది. వారికి విక్షేపదోషనివృత్తి కలగదు.

అదే విధంగా శుద్ధ-బుద్ధ-ముక్త అద్వైత బ్రహ్మన్ని శాస్త్రాలు ప్రతిపాదిస్తున్నాయి. అయినా అవిద్య వలన వంచితమైన (అబద్ధమైన) అంతఃకరణము కల మానవుడు భేదవిశిష్టబ్రహ్మము శాస్త్రము చేత ప్రతిపాదించబడిందని చెబుతాడు.

ఇలా అన్ని ప్రయత్నాలు అంటే – కర్మ, ఉపాసన, జ్ఞానము పొందదలచిన వాడూ, ఆ మూడు వ్యతిరేకమార్గంలో ప్రవహిస్తాయి. విపరీత వస్తువిషయకమైన ప్రయత్నం చేసేవాడు సద్వస్తువును పొందలేడు. అలానే విపరీతము కాని వస్తువు కోసం ప్రయత్నం చేసే మానవుడు అసద్వస్తువును పొందడు. కర్మ, ఉపాసన, జ్ఞానము – ఈ మూడింటికి సంబంధించిన ఈ దృష్టాంతం చూద్దాము:-

మణి, దీపము ఒకచోట వుంచి వాటి మీద చిల్లులున్న కుండను బోర్లిస్తే మణి కావలసినవాడు దీపకాంతిని మణికాంతిగా భావించి మణిని తీసుకోవాలనుకుంటే అలా తీసుకోలేడు. కానీ మణికాంతిని మణిగా భావించి తీసుకోవడానికి ప్రయత్నిస్తే తీసుకోవచ్చు. దీపకాంతిని మణిగా తలచి ప్రవర్తించే మానవుడు విసంవాదిప్రవృత్తిని కలిగినందువలన తత్త్వాన్ని తెలుసుకోలేడు. కానీ మణికాంతిని మణిగానే భావించి మణిని తీసుకోవడానికి ప్రయత్నిస్తే అప్పుడు తీసుకోవచ్చు. దీపకాంతిని మణిగా తలచి ప్రవర్తించే మానవుడు విసంవాది ప్రవృత్తి**ని కలిగివుండటం వలన తత్త్వాన్ని తెలుసుకోలేడు. మణికాంతిని మణిగా తలచి ప్రవర్తించే మానవుడు సంవాదిప్రవృత్తి* కలిగివుండడం వలన మణిని పొందగలడు.

## సత్కర్మ శాస్త్ర ప్రతిపాదితము

కర్మను తెలుసుకోకుండానే ఆచరించినట్లయితే మలదోష నివృత్తి కలగదు. వేదనే మిగులుతుంది.

కర్మ అనేది విధి యొక్క తంత్రము. అంటే అది విధి అధీనంలో వుంటుంది. శాస్త్రాలలో ఏ కర్మ ఏ విధంగా చేయాలని చెప్పబడిందో ఆ కర్మను అదే విధంగా చేయాలి. అలా విధి విహితంగా (విధిననుసరించి) కర్మలను ఆచరించినప్పుడే ఫలము కలుగుతుంది. 'ఫలానా సమయంలో సంధ్యావందనం చేయాలి' అనేది కాలపరమైన విధి. సంధ్యావందనం కూడా విధిని అనుసరించే చేయాలి. అలాగే అర్ఘ్యమివ్వడము, వైశ్వదేవము, బ్రహ్మ యజ్ఞము, పితృతర్పణము మొదలైన

*సంవాది ప్రవృత్తి : ఉన్నది ఉన్నట్లు భావించడం. **విసంవాది ప్రవృత్తి : లేనిది ఉన్నట్లు భ్రమించడం.

సత్కార్యాలు శాస్త్రవిధిననుసరించి చేయాలి.

ఇలాగే నిత్య, నైమిత్తిక, కామ్య, కర్మలు ప్రాయశ్చిత్తాలు మొదలైన కర్మలు విధిననుసరించి ఆచరించినట్లైతే మాత్రమే ఫలము కలుగుతుంది. ఇలాంటి కర్మలు అన్నింటిని ఫలాపేక్షను విసర్జించి నిష్కామభావంతో భగవంతుని ప్రీతి కోసం మాత్రమే చేసినట్లయితే అంతఃకరణలోని మలదోషాన్ని పోగొట్టి, పరంపరననుసరించి క్రమంగా జ్ఞానాన్ని కలిగిస్తాయి.

## సదుపాసనము శాస్త్ర ప్రతిపాదితము

ఉపాసన కూడా విధిని (శాస్త్రవిధిని) గమనించకుండా చేసినట్లయితే విక్షేపదోష నివృత్తి కలగదు. ఎందుకంటే ఉపాసన విధితంత్రము, పురుషతంత్రము మాత్రమే! వస్తుతంత్రము మాత్రం కాదు. శాస్త్రాలలో **'యోషా వా అగ్నిః'** అని వుంది. స్త్రీపట్ల మాత్రమే అగ్ని అనే భావం కలిగివుండాలి. ఈ శాస్త్ర ప్రతిపాదితమైన విధి చేత స్త్రీ యందు అగ్నిభావన కలుగుతుంది. అప్పుడు లోక ప్రసిద్ధమైన అగ్ని నిరపేక్షమై (అపేక్షింపదగనిదై, కోరుకోదగనిదై) స్త్రీ పట్ల మాత్రమే అగ్ని బుద్ధి కలుగుతుంది. కాబట్టి ఇక్కడ స్త్రీ పట్ల వున్న అగ్నిభావము విధితంత్రము, పురుషతంత్రము కూడాను!(శాస్త్ర ప్రతిపాదితము, పురుష ప్రతిపాదితము కూడా).

ఆ కారణంగానే హరిహరులు, జగన్మాత, కాళీ, సూర్యుడు, గణపతి మొదలైన వారి పూజలు కూడా శాస్త్రాలలో చెప్పబడిన విధిననుసరించే చేయాలి. ఉదాహరణకు ఏ పుష్పంతో ఏ దేవుని పూజించాలని శాస్త్రాలలో చెప్పబడి వుంటుందో వాటితోనే పూజించాలి. వేరే విధంగా చేయకూడదు. ఆ విధానంలో లోపం జరిగితే విధి పూర్వకంగా చేయని కర్మ వల్ల విక్షేప దోషనివృత్తి అనే ఫలం కలుగదు. క్లేశము (బాధ, వేదన, పీడ) మాత్రము కలుగుతుంది. మంచి శాస్త్రాలను శ్రవణం చేయడం పట్ల ప్రేమ కలుగదు. విక్షేపదోషము మూర్తిపూజతో (విగ్రహాలను పూజించడంతో) పోతుంది. ఈ విధంగా విజ్ఞానము పొంది మూర్తిపూజ చేసినట్లయితే సఫలీకృతుడౌతాడు.

కానీ మూర్తిని పూజిస్తూ అలా ఎందుకు పూజించాలి అనే విషయం మీద దృష్టి పోకపోతే జీవితమంతా ప్రతిమలతో (విగ్రహాలతో) ఆడుకుంటూవున్నా అతనికి ఫలము కలుగదు. పిల్లలు పేడ బొమ్మలతో ఆడుకున్నట్లు విషయాన్ని గ్రహించనిదే మూర్తిపూజను చేస్తే ఏమి ఉపయోగము?

## శాస్త్ర ప్రతిపాదిత శుద్ధ - బుద్ధ - ముక్త - అద్వైత బ్రహ్మజ్ఞానము

అలానే శుద్ధ బుద్ధ ముక్త అద్వైత బ్రహ్మము కూడా శాస్త్ర ప్రతిపాదితమైన జ్ఞానము. అవిద్యామయమైన అంతఃకరణము కలవాడు భేద విశిష్టమైన బ్రహ్మము శాస్త్రప్రతిపాదితమని అంటాడు. అతని ప్రయత్నము తలక్రిందులుగా జరుగుతుంది. దేహము ఇంద్రియాల పట్ల ఆత్మబుద్ధి కలిగి వుండి ఆత్మసాక్షాత్కారాన్ని పొందాలనుకునే వాడికి తత్వము లభించదు. అలాగే శుద్ధ బుద్ధ ముక్త బ్రహ్మాన్ని విడచి క్షణికములైన సంసారికమైన భోగాల కోసం గౌణ దేవతలను (గుణాలతో వున్న దేవతలను) బ్రహ్మముగా భావించి వారిని ఉపాసించినప్పటికీ వారు జ్ఞానమనే తత్వాన్ని లభింపచేయలేరు. శాస్త్ర ప్రతిపాదితమైన శుద్ధ బుద్ధ ముక్త పరబ్రహ్మాత్మకమైన జ్ఞానాన్ని విడిచిపెట్టి కర్మను గురించిన భాగాన్ని, ఉపాసన గురించిన భాగాన్ని స్వీకరించి విధి తంత్రాన్ని, పురుష తంత్రాన్ని మాత్రమే అంగీకరించేవాడు జ్ఞానం వలన పొందదగు దానిని ఆవరణ నివృత్తి పూర్వకమైన మోక్షఫలాన్ని పొందడు. అతని ప్రయత్నము మరొకవైపుకు వుండటమే దీనికి కారణము.

జ్ఞానము విధి తంత్రము పురుష తంత్రము కాదు – వస్తు తంత్రము. జ్ఞానము ప్రమాణ జన్యము (ప్రమాణము నుండి పుట్టేది). ప్రమాణము యథా భూత వస్తు విశేషకము. పదార్థము ఎలా వున్నదో అలానే దాని జ్ఞానము కలిగి చేయడము ప్రమాణపు కర్తవ్యము. లోకప్రసిద్ధమైన అగ్నియందు అగ్ని పదార్థ విషయకమైన జ్ఞానమే ప్రమాణ లభ్యము. ఇందులో విధి తంత్ర, పురుష తంత్రాల ప్రాముఖ్యత లేదు. వస్తువు ఎలా వున్నదో అలానే అది తెలుసుకోవాలి.

పురుషుడు 'కర్తుం అకర్తుం అన్యథాకర్తుం' అంటే చేయడానికి, చేయకుండా వుండటానికి, మరొక విధంగా చేయటానికి సమర్థుడు. కానీ అలా వస్తుజ్ఞానము వేరేవిధంగా కలగడానికి వీలులేదు. ప్రకృతమైన బ్రహ్మజ్ఞానము కూడా వస్తుతంత్రమే. సచ్చిదానంద స్వరూపుడైన బ్రహ్మము యొక్క భావము తత్వమస్యాది మహావాక్యాల ద్వారా స్వరూపమందే కలుగుతుంది.

**- సశేషం**

# బుద్ధ ధ్యాన హృదయము

(గత సంచిక తరువాయి)

పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ

## అధ్యాయం - 3

### సమ్యక్ స్మృతి యొక్క 4 లక్ష్యాలు

1) శరీరము 2) భావము, వేదన (feeling) 3) మానసిక స్థితి మనసులోని అంశాలు. సంపూర్ణ మానవుడు అతని అనుభవమంత సమ్యక్ స్మృతి యొక్క లక్ష్యము. శరీరముతో ఆరంభమై దాని క్రియలు, యింద్రియానుభవాలు, వాటిలోని అంశాలు, యోచన దాక మానవుని వ్యక్తిత్వం మీద ఆధారపడటం వల్ల సాధనకు విశాలము, భద్రము అయిన చక్కటి పునాది యేర్పడుతుంది. సాధనకు మానవుని వ్యక్తిత్వాన్నంతా ఆధారం చేసుకోకపోతే అందులో ప్రధానంగా మనచేత పరిగణింపబడే అంశాలనుండి సాధనకు వ్యతిరేకమైన చర్యలుత్పన్నమై సాధన నాటంకపరచటము, ప్రక్కదారి పట్టించటమూ గాక చిరకాలమభ్యసించి సాధించిన ఫలితాలను గూడ నాశనం చేసే అవకాశమున్నది. కనుక నిర్దుష్టమైన సాధనే యింతటి లక్ష్యాన్ని సాధించగలదు. సాధనకు, తద్వ్యతిరిక్త శక్తులకు మధ్య ఘర్షణలో - శరీరానికి, మనస్సుకు మధ్య వివేకానికి వివేకానికి మధ్యలాంటివి - ఎంతో శక్తిని వృధా చేయడముగాక అపజయానికి గూడా కారణమౌతుంది. మనమే శక్తులను ప్రతిఘటించి అతిక్రమించాలో, మలచుకోవాలో నిర్దుష్టంగా గుర్తించుకోవడమవసరం. ఇందుకు సంప్రజ్ఞ సాధన అన్ని విధములైన స్మృతిని సంస్కరించుకోవాలి. అయితే సాధనక్రమంలో శారీరక స్మృతినుండి కొన్ని విషయాలనే యెన్నుకొని వాటిపై స్మృతి సాధన చేయటంతో ఆరంభం చేయాలి.

అభ్యాసానికి సూచనలు: ఇందులో ప్రతి అభ్యాసాన్ని మొదట తనకు, తరువాత యితరులకు, తరువాత ఉభయులకు అన్వయించుకొని సాధన చేయాలి. ఇలా యెందుకు చెయ్యాలో చూద్దాం.

యీయాంగ్ అను మనస్తత్వ శాస్త్రకారుడు మానవులను బహిర్ముఖులు, అంతర్ముఖులుగా విభజించాడు. మొదటివారు బాహ్య విషయాలను, రెండవవారు అంతర్విషయాలను



భావించే స్వభావం కలవారై వుంటారు. వారి మనోవైఖరి పాక్షికం గనుక మొదటివారికి బాహ్యవిషయాలలోను, రెండవవారు అంతర్విషయాలలోను తక్కువ ప్రజ్ఞ కలిగి వుంటారు. ఈ సాధకత అనే దోషాన్ని పైన చెప్పిన సాధన సరిదిద్దుతుంది.

చాలా విషయాలు యితరులలోగాని, బాహ్య విషయాలలోగాని గుర్తించి అవగాహన చేసుకోవడం తేలిక మనలో కంటే. వాటిలోని గుణదోషాలు మరింత స్పష్టంగా అర్థమౌతాయి. ఆ విషయంలో బహిర్ముఖులు యెక్కువ సమర్థులు. అయితే వీరు తమలోని విషయాలను బాగా గుర్తించగలవారుగా వుండరు. తమను తాము సంస్కరించుకోటానికదెంతో అవసరం. ఉదాహరణకు అనిత్యత్వము అనే ధర్మాన్ని బాహ్య జగత్తుకు మాత్రమే అన్వయించుకొని చూచినప్పుడు సాధనకు పరిమితమే, పాక్షికమే అవుతుంది. మూడవ మెట్టయిన బాహ్యాభ్యంతర విషయాలకు క్రొత్త విషయాలకు అన్వయించుకొని చూడటం వలన యీ రెంటికి గల సామ్యతలు, విభేదాలు స్పష్టమౌతాయి. ఆ రెండింటికి గల సంబంధం బాగా అర్థమౌతుంది. ఉదాహరణకు మన దేహం గాని, బాహ్య ప్రకృతిగాని ఒకే పదార్థంతో చేయబడుతుంది. అంతేగాక యీ రెంటి మధ్య కార్యకారణ సంబంధం గూడా బాగా అర్థమౌతుంది. కారణం యీ కార్యకారణ సంబంధమే తమ రూపంగా గల సాపేక్షికమైన అనుభవాలెన్నో వున్నాయి. ఈ సాధన ద్వారా అయితే వాటి తత్వం బాగా అర్థమౌతుంది. అంతేగాక కేవలశ్రద్ధ సంప్రజ్ఞానాల ద్వారా మనం సాధించిన జ్ఞానం బాహ్యాభ్యంతర విషయాల రెంటిలోను ఉదాహరింపబడుటవలన అదియెంత సత్యమైనదో మనకు హృదయగతము కాగలదు. ఈ రెండు వస్తుత్వము లేనివని బాగా వెల్లడి కాగలదు. సర్వము వ్యక్తిత్వ రహితమైన క్రియారూపమని దృఢపడగలదు.

అయితే క్రమబద్ధమైన సాధన ద్వారా లోచూపును పెంచుకోవడంలో అంతర్విషయాలను కేవలశ్రద్ధకు గురిచేయడం జరుగుతుంది. కారణం తనయొక్క శారీరక, మానసిక క్రియలే ప్రత్యక్ష అనుభవాలు, ప్రత్యక్ష జ్ఞానం. అందుకని యోచన, అనుమాన ప్రమాణము అనేవాటిని ఆరంభదశలో ప్రక్కకు వుంచవలసి వుంటుంది. ప్రత్యక్షానుభవాన్ని ఆధారంగా చేసుకొని భూత భవిష్యత్తులలోని అటువంటి అంశాలకు వర్తమానంలో సాధించిన మన అనుభవజ్ఞానాన్ని అన్వయించుకొనేటప్పుడు సాధన, సాధనలో మూడుదశలలో యీ రెండూ వినియోగించబడతాయి. అయితే ధ్యానేతర సమయాలలో సమ్యక్ స్మృతిని బాహ్యవిషయాల పట్ల పనిచేయించాలి. ఇతరుల శారీరక మానసిక క్రియలు యీ కోవకు చెందుతాయి.

ఈ జ్ఞాన పద్ధతులను విడివిడిగా మరో విధంగా గూడా ఉపయోగించుకొనేటప్పుడు వాటిలో మూడంశాలను గుర్తించాలి. 1) ఉత్పత్తి 2) లయము 3) ఉత్పత్తిలయాలు. ఈ విధంగా మార్పుయొక్క తత్వాన్ని, వాస్తవాన్ని ప్రత్యక్షంగా గుర్తించడం సాధన సాఫల్యానికి యెంతో అవసరం. మూలగ్రంథంలో ఒకే పదం రెండుసార్లు ఉపయోగించబడినపుడు వాటి వివరణకై వ్యాఖ్యానాన్ని పరిశీలించాలి. వ్యాఖ్యానం ప్రత్యక్షంగా మనం గుర్తించిన సత్యాలకు యోచనాపూర్వకంగా సర్వవిషయాలకు అన్వయించుకొని బుద్ధధర్మాన్ని యెలా అన్వయించుకోవాలో చెబుతుంది. ఉత్పత్తిలయాల గూర్చిన అనుభవజ్ఞానాన్ని సత్యదూరాలు కేవలం ఊహాజనితాలు అయిన సిద్ధాంతాలకు మనం లోబడకుండా వుండడానికి వినియోగించుకోవాలి. ఉదాహరణకు శూన్యపదార్థవాదాలను 'ఉత్పత్తి' అనే సత్యంతో ప్రతిఘటించాలి. సర్వమూ శాశ్వతమైన సత్యమే, జగత్తు సత్యము మొదలగు వాదాలను 'లయం' అనే సత్యంతో ప్రతిఘటించాలి.

తక్కిన గ్రంథం అంతా ఈ రెండంశాలతో కూడిన అభ్యాసాలయొక్క ఫలితాలను చెబుతుంది. శరీరమున్నది, భావమున్నది, కాని వ్యక్తిత్వం లేదు అని. అంటే వస్తువుల యొక్క నిజతత్వాన్ని తెలుపుతుంది. వాటి నిజతత్వాన్ని గుర్తించినవారు వాటినుంచి స్వతంత్రుడుగా, అలిప్తుడుగా జీవించగలుగుతాడు. కనుక సాధకుడు అసత్యదృష్టినుంచి, దానినాధారంగా చేసుకొన్న తృష్ణనుంచి విముక్తి పొందుతాడు.

అంతేగాక యీగ్రంథంలోని వాక్యాలు సమ్యక్ సంబోధి అనబడు పరిపూర్ణజ్ఞాన స్థితినుండి ఉద్భవిస్తాయి. కనుక హృదయం మీద కొంతవరకైనా ప్రభావం కలిగి వుంటాయి. అవి సంపూర్ణం కావడం వల్ల అన్ని స్థాయిల వారికి అర్థమై తృప్తికరంగా వుంటాయి. మనస్సును శాంతపరచేవిగాను, (అంటే సందేహాలను, అంతఃసంఘర్షణలను అంతమొందిస్తాయి) ఉత్తేజకరంగాను వాటి భావగాంభీర్యం వల్ల అవగాహనను విస్తరింపజేస్తాయి.

**- సశేషం**

# భగవాన్ శ్రీ భరద్వాజ

శ్రీమతి శ్రీదేవి

## అధ్యాయం - 2

## ఆదిదేవుని ఆవిర్భావం

(గత సంచిక తరువాయి)

భరద్వాజ చక్కని అవయవ సౌష్టవంతో దివ్య తేజస్సుతో వెలిగి పోతుండేవాడు. చక్కని గిరిజాల జుట్టు, ముద్దులొలికే ముఖం, కాంతివంతమైన కళ్ళు - చాలా ఆరోగ్యంగా, అందంగా, బలిష్టంగా వుండేవాడు. పిల్లవాడిని ముద్దుగా ఎవరైనా ఎత్తుకొనబోతే చాలా బరువు అనిపించి మోయలేకపోయేవారు. సాధారణంగా నలభై ఏండ్లు దాటిన స్థూలకాయులు క్రింద కూర్చుంటే మరల పైకి లేచి నిలబడాలంటే చాలా కష్టంగా లేస్తుంటారు. క్రింద కూర్చోవాలన్నా వారికి చాలా బాధగాను, అసౌకర్యంగానూ వుంటుంది. అయితే మూడేండ్ల పసివాడైన భరద్వాజ బాగా లావుగా, పుష్టిగా వుండటంతో అతని పరిస్థితి అదే విధంగా వుండేది. నేలపై కూర్చోలేక పోయేవాడు. కూర్చుంటే లేవలేకపోయేవాడు. అందుకని ఏదో ఒక ఎత్తు బల్లగానీ, పీటగానీ, రాయిగానీ ఏదో ఒకటి - కొంచెం ఎత్తుగా వుండే వస్తువు చూసుకుని దానిమీద కూర్చునేవాడు. అంత చిన్నపిల్లవాడు అట్లా కూర్చోలేక లేవలేక ఆపసోపాలు పడుతుంటే చూసిన వాళ్ళకు బాగా నవ్వొచ్చేది.

ఒకరోజు భరద్వాజకి క్రింద కూర్చోటానికి ఎత్తుగా వుండే వస్తువేదీ కన్పించలేదు. అప్పుడు "ఒరే బోధా! యిటు రారా" అంటూ అన్న బోధాయనను పిలిచాడు. అతడు భరద్వాజగారి కంటే రెండేళ్ళు పెద్దవాడు. అయిదేళ్ళ బోధాయన తమ్ముడు పిలుపు విని తమ్ముడి వద్దకు వచ్చాడు. భరద్వాజ "కూర్చోరా" అన్నాడు. బోధాయన కూర్చున్నాడు. ఆ తర్వాత "బాగా వంగుని కూర్చోరా" అన్నాడు ముద్దు మాటలతో. బోధాయన ముందుకు వంగి కూర్చోగానే కొంచెం ఎత్తుగా వున్న అతడి వీపుమీద హాయిగా నిశ్చింతగా కూర్చున్నాడు చిన్నారి భరద్వాజ. ఆ దృశ్యం చూసి అందరూ పొట్ట చెక్కలయ్యేలా నవ్వారు. ఆ రోజునుంచి తనకు కూర్చోటానికి ఎత్తైన వస్తువు దొరకనప్పుడల్లా బోధాయననే తనకు ఎత్తుపీటగా ఉపయోగించుకొనేవాడు భరద్వాజ. అందుకు అయిదేండ్ల వయస్సున్న బోధాయను కూడా తమ్ముడిపై ప్రేమతో కాబోలు, ఏ మాత్రం అభ్యంతరం చెప్పకుండా అతడు ఎంతసేపు తన వీపుమీద కూర్చుంటే అంతసేపు అట్లాగే వంగి కూర్చుని తమ్ముడు సౌలభ్యంగా కూర్చునేందుకు సహకరించేవాడు.

ఈ దృశ్యం చూపరులను ఆకర్షిస్తూ ఎంతో నవ్వు తెప్పిస్తుండేది.

చిన్న పిల్లవాడయినా కూడా భరద్వాజ ఎంత బలంగా వుండేవారో తెలియజేసే మరొక ఉదాహరణ కూడా నవ్వు తెప్పిస్తుంది.

"ఢీ, ఢీ" అని ఒక ఆటను ఆ రోజుల్లో పిల్లలు ఎక్కువగా ఆడుతుండేవారు. ఆ ఆటలో యిద్దరు పిల్లలు ఒకరికొకరు ఎదురెదురుగా కొంచెం దూరంలో నిలబడి "ఢీ, ఢీ, ఢీ" అంటూ దగ్గరగా వచ్చి పొట్టేళ్ళల్లాగా ఒకరి తలతో ఒకరు నుదుటి భాగం మీద ఢీ కొంటారు. వాళ్ళకు నొప్పి పుట్టేదాకా

అలా ఢీ కొంటూనే వుంటారు. ఎవరికి నొప్పి పుట్టి "యింక వద్దు" అంటే వాళ్ళు ఓడిపోయినట్లుగా లెక్క.

వేదవ్యాస వయస్సులో భరద్వాజగారి కంటే పది సంవత్సరాలు పెద్దవాడు. ఒకరోజు పదమూడేండ్ల వేదవ్యాస మూడేండ్ల భరద్వాజతో తమ్ముణ్ణి ఆడిద్దామనే ఉద్దేశంతో "భరద్వాజా! ఢీ! ఢీ! ఆట ఆడదామా?" అని అడిగాడు, ఎంతో ముద్దుగా. భరద్వాజ "అలాగే!" అని తల ఊపాడు. ఇద్దరూ ఎదురెదురుగా నిలబడి "ఢీ! ఢీ!" అంటూ ఒకరికొకరు ఢీకొన్నారు. అంతే! వేదవ్యాస్ కళ్ళు తిరిగి క్రింద పడిపోయాడు!. భరద్వాజలో దెబ్బ తగిలినట్లుగానీ, నొప్పి పుట్టినట్లుగానీ ఏ మాత్రం బాధ వ్యక్తం కాలేదు. ఇంట్లో వాళ్ళు నొప్పితో క్రింద పడ్డ వేదవ్యాసని చూసి కంగారుపడ్డారు. మూడేండ్ల పసివాడి దెబ్బకు పదమూడేండ్ల పిల్లవాడు అలా సొమ్మసిల్లి పోవటం చూసి అందరూ నవ్వసాగారు.

అన్నయ్య ఎందుకలా పడిపోయాడో, అందరూ అతనిని చూసి ఎందుకు బాధపడ్తున్నారో కూడా తెలియక అమాయకంగా అన్నయ్యను చూస్తూ నిలబడ్డ భరద్వాజని చూసి అందరూ "వీడు పిల్లవాడు కాదురా బాబూ! పిడుగు!" అనుకున్నారు. అరుదుగా ఎప్పుడైనా బయట పిల్లలతో దెబ్బలాట వస్తే ఆ పిల్లలు భరద్వాజతో పోటీ పడలేక మళ్ళీ మరొకసారి యితని జోలికి వచ్చేవాళ్ళు కాదు. "బాబోయ్! ఆ భీముడితో పెట్టుకోకూడదు" అంటూ దూరంగా పారిపోయేవాళ్ళు.

చిన్న వయసు నుండీ భరద్వాజకి నిద్ర అంటే ఎంతో యిష్టం. అతనికి ఎంతో గాఢనిద్ర పట్టేది. ఆ నిద్రకు భంగం వాటిల్లటం ఆయనకు ఏ మాత్రం యిష్టం వుండేది కాదు. అందువల్ల ఎండా కాలంలోనైనా యింట్లోనే పడుకునేవాడు. వర్షం వస్తే నిద్రాభంగం అవుతుందని ఆరుబయట పడుకోవటానికి యిష్టపడేవాడుకాదు.

12 సంవత్సరాల వయస్సులో మెట్రిక్యులేషన్ పరీక్షలు వ్రాసేందుకు తల్లిదండ్రులతో వారణాసి వెళ్తున్నప్పుడు పైబెర్తులో నిద్రపోతున్న భరద్వాజ నిద్రలో దొర్లి క్రింద కూర్చుని పేకాట ఆడుకుంటున్న మనుషుల మధ్యపడ్డాడు. అంత ఎత్తు నుంచీ క్రిందపడినా ఏ మాత్రం నిద్రాభంగం కలుగలేదు. అతణ్ణి నిద్ర లేపాలని, బెర్త్ పై పడుకోమని చెప్పాలని ఎందరు ప్రయత్నించినా వారి ప్రయత్నాలన్నీ విఫలమై భరద్వాజగారిని వారు గాఢనిద్రనుండి మేల్కొల్పలేకపోయారు. చివరకు ఆ పేకాట పెద్ద మనుష్యులు భరద్వాజని ఎత్తుకొని బెర్తుపై పడుకోబెట్టవలసివచ్చింది.

పెద్దన్న కృష్ణమాచార్య భరద్వాజ కంటే 12 సంవత్సరాలు పెద్దవాడు. అందరికంటే చిన్నవాడైన భరద్వాజని కృష్ణమాచార్య క్షణం కూడా విడువకుండా ఎత్తుకుని తిప్పుతూ ఆడిస్తూ వుండేవాడు. అన్నయ్య దగ్గర భరద్వాజకి ఎంతో చనువు, స్వతంత్రం వుండేవి. కృష్ణమాచార్య తమ్ముణ్ణి ఎత్తుకుని, బజారుకు తీసుకెళ్ళి కావలసినవన్నీ కొనిపెట్టేవాడు. హోటల్ కు తీసుకెళ్ళి కావలసిన ఫలహారాలు తినిపించేవాడు. ఇంట్లో కూడా ఎప్పుడూ తమ్ముణ్ణి ఆడిస్తూ సముదాయిస్తూ అవసరాలను గమనిస్తూ కనిపెట్టి వుండేవాడు. తన ఆలన, పాలన చూస్తూ, తననెంతో గారాబం చేస్తూ, కోరినవన్నీ యిస్తూ ప్రేమించే అన్నయ్య కృష్ణమాచార్య అంటే భరద్వాజకి ఎంతో యిష్టం.

అందరికంటే చిన్నవాడు అవటం వల్ల, యింట్లో మిగతావారి కంటే భరద్వాజ యిష్టమే ఎక్కువగా చెల్లుబాటు అవుతుండేది. అయిదారేండ్ల వయసులో శ్రీభరద్వాజ తన అవసరాలు, యిష్టాలు నెరవేర్చుకునే పద్ధతి చిత్రంగా వుండేది. తండ్రి దగ్గరకు, అన్నల దగ్గరకు గాని వెళ్ళి "నాకు యిప్పుడు ఏం కావాలి?" అని అడిగేవాడు. వాళ్ళు ఆ సమయాన్ని సందర్భాన్నీ బట్టి "నీకు యిప్పుడు పాలు కావాలి" అనో, లేకపోతే "స్నానం కావాలి" అనో చెప్పి ఆ పని నెరవేర్చేవారు. టిఫిన్ టైములోను, భోజనం టైములోనూ కూడా అదే పద్ధతి. అదేమి పద్ధతి? ఎవరికి కావలసినదేమిటో వాళ్ళే అడుగుతారు. తనకేమి కావాలో యితరులకేమి తెలుస్తుంది? కానీ మన కథానాయకుడి పద్ధతి అదికాదు. మరి యింట్లో అందరికీ మురిపాల గారాబు ముద్దుబిడ్డ కదా! ఆడిందే ఆట పాడిందే పాట! తనకేం కావాలో యితరులే ఆలోచించి తనకివ్వాలి. తనకై తాను ఆలోచించడు, ఆజ్ఞాపిస్తాడు. అంతే! ఆ ఆజ్ఞకు తిరుగులేదు.

ఈ ఆజ్ఞలు, యీ చేష్టలు చూసి యింటా, బయటా అందరూ ముగ్ధులవుతుండే వాళ్ళు.

చిన్నప్పటినుండి కూడా భరద్వాజ కాఫీ అంటే చాలా యిష్టపడేవాడు. భరద్వాజ తనకు కాఫీ తాగాలనిపిస్తే కాఫీ యివ్వమని అడిగే విధానం కూడా నవ్వొచ్చేలాగా వుండేది. కాఫీ కావాలని నేరుగా అడిగేవాడు కాదు. "కా అంటే కూ! కాఫీ అంటే కూఫీ!" అని రాగం తీస్తూ పాట పాడటం మొదలు పెట్టేవాడు. కాఫీ యిచ్చేదాకా ఎంతసేపైనా పాడుతుండేవాడు. "వీడికి కాఫీ కావాలి కాబోలు, పాట ప్రారంభించాడు!"

అనుకుంటూ యింట్లోవాళ్ళు కాఫీ యిచ్చేవారు.

ఒకసారి శ్రీ అనంతాచార్యులవారు నలుగురు పిల్లలను తీసుకుని ఏదో ఊరు బయలుదేరారు. రైల్వేస్టేషన్లో వీళ్ళు ఎక్కవలసిన రైలు బయలుదేరటానికి సిద్ధంగా వున్నది. శ్రీ అనంతాచార్య రైలు అందుకోవాలనే ఆతృతతో పిల్లలతో గబగబా ప్లాట్ఫాంపై నడుస్తున్నారు. ఇంతలో చిన్నారి భరద్వాజ ఎంతో కంగారుగా "నాన్నగారూ! నాన్నగారూ!" అని పిలిచాడు. శ్రీ అనంతాచార్య పిల్లవాణ్ణి చూసి ఆగి, "ఏమిటి? ఏమైంది?" అన్నారు. భరద్వాజ చిన్నగా చూపుడు వేలుతో ప్లాట్ఫాంపై ఒక దిక్కు చూపించాడు. అక్కడ ప్లాట్ఫాం మీద ఒక వ్యక్తి కాఫీ, టీ అమ్ముతూ కన్పించాడు. భరద్వాజ "నాన్నగారూ, కా అంటే కూ, కాఫీ అంటే కూఫీ" అని పాట పాడాడు. అంటే తనకు కాఫీ ఇప్పించమని ఆ పాటకు అర్థం! ఆ తొందర సమయంలో చిన్న తమ్ముడి పాట విని అన్నలంతా నవ్వారు. అనంతాచార్యగారికి మతిపోయినంత పనైంది. ఎదురుగా ట్రైను కొద్ది క్షణాలలో కదలబోతున్నది. పిల్లవాడి వైపు చూసి, "ఇదా సంగతి! ఇందుకా, నన్ను ఆపి మరీ కాఫీ పాట పాడుతున్నావ్? ఇప్పుడు కాఫీ తాగుతూ కూర్చుంటే అవతల ట్రైను వెళ్ళిపోతుంది. తర్వాత తాగుదువుగానిలే కాఫీ, పద, పద" అంటూ పిల్లవాడి చెయ్యి పట్టుకొని త్వరత్వరగా నడచి రైలు అందుకున్నారు. ఆ తర్వాత రైల్లో భరద్వాజకి కాఫీ యిప్పించారు.

శ్రీ భరద్వాజ చిన్న పిల్లవాడుగా వున్నప్పుడు అనుకోకుండా జరిగిన ఒక సంఘటన అతని జీవితేశుడైన శ్రీ శిరిడీ సాయినాథుడు అతని భవిష్యత్తునంతా తమ స్వాధీనంలోకి తీసుకుని అతనిని పూర్తిగా తమవాడుగా చేసుకుని అతని జీవన సూత్రధారి తామేనని తెలియజెప్పే సంకేత చర్యగా తోస్తుంది. ఆ సంఘటన పూర్వాపరాలు యీ విధంగా వున్నాయి.

అనంతాచార్యులవారి మేనత్త కుమార్తె లక్ష్మీనరసమ్మగారు, ఆమె భర్త మావూళ్ళయ్యగారు విజయవాడకు సమీపగ్రామంలో నివసిస్తుండేవారు. వారికి ఎంతకాలానికీ సంతానం కలుగనందున ఒక ఆడపిల్లను పెంచుకొనటం జరిగింది. కొంతకాలానికి వాళ్ళ ఆర్థికస్థితి పూర్తిగా దిగజారి రోజు గడవని పరిస్థితి వచ్చింది.

ఒకనాటి సాయంత్రం మావూళ్ళయ్యగారు చల్లగాలికి ఆరుబయట వాలు కుర్చీలో కూర్చుని వున్నారు. ఆయన తన దుస్థితికి ఎంతగానో చింతిస్తూ ఆ కష్ట పరిస్థితిని ఎలా ఎదుర్కోనాలో, ఏమి చేయాలో దిక్కుతోచక, కలతచెందిన మనస్సుతో దిగులుగా వున్న ఆ సమయంలో రివ్వున వీచిన గాలికి ఒక కాగితం ఎగురుతూ వచ్చి సూటిగా ఆయన ఒడిలో పడింది. ఆయన ఆశ్చర్యంగా ఆ కాగితాన్ని తీసిచూడగా అది ఒక చక్కని సాయిబాబా ఫోటో! ఆ ఫోటో క్రింద "నేనుండగా భయమెందుకు?" అని వ్రాసి వున్న వాక్యాలు ఆయనకు మరింత ఆశ్చర్యాన్ని కలిగించాయి. తన చింతలన్నీ విడచి, తమ చింతనలో నిలచి, తమను నమ్మి నిశ్చింతగా వుండమని శ్రీ సాయిబాబా తనకు చెపుతున్నట్లుగా ఆయనకు స్ఫురించింది. వెంటనే బాబాపై భారంవేసి, ఉన్న కొద్ది పైకం తీసుకుని భార్య, పదినెలల పసికందును వెంటనిడుకొని కట్టుబట్టలతో, యిల్లు విడచి, గమ్యాన్ని వెతుక్కుంటూ బయలుదేరారు. ఆ సమయంలో ఆయనది చాలా చిత్రమైన పరిస్థితి. ఎదురుగా వున్న బస్సెక్కారు. చేతిలో పైకంతో సరిపోయే ఊరి టికెట్టు కొన్నారు. మార్గమధ్యంలో ఒక ఊరి వద్ద బస్సు చెడిపోవటంతో ప్రయాణీకులంతా క్రిందకు దిగారు. అదే సమయంలో ఆ పసిపాప ఆకలితో ఏడవసాగింది. పాపకు కాసిని మంచినీళ్ళయినా త్రాగిద్దామనుకొంటూ మావూళ్ళయ్యగారి భార్య గ్రామంలోని ఒక యింటికి వెళ్ళి మంచినీళ్ళడిగింది. ఆ యింటి యిల్లాలు ఎంతో ఆదరంతో వారిని కూర్చోమని చెప్పి వారి వివరాలడిగి తెలిసికొని, వారి దుస్థితికి జాలిచెంది, వారిని సాయంత్రం తన భర్త వచ్చేవరకు వుండవలసిందని, ఆయన వారి జీవనోపాధికి మార్గం చూపించగలరనీ చెప్పింది. ఆమె చెప్పినట్లే ఉదారహృదయుడైన ఆమె భర్త వారి పరిస్థితి విని, ఆ ఊరి చుట్టుప్రక్కల వ్యాపించి వున్న తుమ్మచెట్ల పొదలను కట్టెలుగా కొట్టుకొని కాల్చి బొగ్గుల వ్యాపారం చేసుకొమ్మని, తాను అందుకవసరమైన ధన సహాయాన్నందిచగలననీ చెప్పటంతో, అది శ్రీ సాయిబాబా ఆదేశంగా భావించిన మావూళ్ళయ్య దంపతులు బొగ్గుల వ్యాపారం మొదలుపెట్టి ఆ ఊరులో స్థిరపడ్డారు. కాలాంతరంలో వారు గొప్ప ధనవంతులైనారు. తమ జీవితమంతా శ్రీ సాయినాథుని ఆరాధిస్తూ ఆయన అనుగ్రహానికి పాత్రులై గొప్ప సాయిభక్తులుగా ప్రసిద్ధికెక్కారు.

శ్రీ అనంతాచార్యులుగారు పిల్లలు చిన్నవారుగా వున్న రోజులలో ఒకసారి పిల్లలతో లక్ష్మీనరసమ్మగారింటికి వెళ్ళి నాలుగు రోజులున్నారు. లక్ష్మీనరసమ్మగారి పూజామందిరంలో ఒక సాయిబాబా మట్టి విగ్రహం వుండేది. ఆ విగ్రహాన్ని చూసిన శ్రీ అనంతాచార్యగారి పిల్లలు బాబా దేముడు కాదని, ఆయనను

పూజించ నక్కరలేదనీ ఆ దంపతులతో వాదిస్తుంటే, వారు పిల్లలతో యిష్టం లేకుంటే వారు పూజించనక్కరలేదని తమ నమ్మకం తమది అనీ సమాధానమిచ్చి మిన్నకుండి పోయారు.

చిన్నపిల్లవాడైన భరద్వాజ మాత్రం వాళ్ళతో, “బాబా విగ్రహం విరగ్గొడతాను. అప్పుడు మీ బాబా ఏం చేస్తాడో చూస్తాను” అన్నాడు పంతంగా. వాళ్ళు అలా చేయవద్దని పిల్లవాడిని వారించారు. అయితే అదనుకోసం ఎదురు చూస్తున్న భరద్వాజ ఒకనాటి ఉదయం లక్ష్మీ నరసమ్మ గారు పెరట్లో కూర్చుని పాత్రలు తోముకుంటున్న సమయంలో పెరటివైపు వున్న గ్రిల్ వరండా తలుపు బోల్టు వేసి, ఆమె పూజా మందిరంలోనున్న సాయిబాబా మట్టి విగ్రహం మెడకు తాడుకట్టి, “ఇదిగో! నీ బాబా విగ్రహం పగలగొడుతున్నాను. నీ బాబా ఏం చేస్తాడో చూస్తా!” అంటూ ఆమె చూసేలా విగ్రహాన్ని తాడుతో ఊపసాగాడు. అది చూచి ఆమె కంగారుగా పగలగొట్ట వద్దని ఎంతగా బ్రతిమాలుతున్నా వినక మరింత వేగంగా ఊపడంతో ఆ విగ్రహం గోడకు కొట్టుకొని పగిలిపోయింది. లక్ష్మీనరసమ్మగారు ఆ సంఘటనకు తీవ్రంగా బాధపడి, ఆ రోజంతా అన్నం తినకుండా ఏడుస్తూ పడుకుంది.

“బాబా యీ మట్టి విగ్రహంలో మాత్రమే వున్నాడని అనుకుంటున్నావా? ఆయన అంతటా వున్నాడు. ఈ బొమ్మ పగిలిపోతేనేమి? మరొక బొమ్మను తెచ్చుకుందాము. నువ్వేమీ బాధపడకు” అంటూ ఆమె భర్త ఆమెను ఓదార్చారు. ఆయన యింకా యిలా అన్నారు – “వాడు చిన్నవాడు. అది దేముడి బొమ్మ అని, ఆ బొమ్మతో ఆటలాడకూడదనీ వాడికేమి తెలుసు? ఈ రోజు వాడు ఆయన మెడలో తాడువేసి ఆడుతున్నాడు. భవిష్యత్తులో ఆయన వాడిని తమ ఉచ్చులో వేసి తమ వాడినిగా చేసుకుంటారేమో! పిచ్చుక కాలికి తాడుకట్టి తమ దగ్గరకు లాక్కున్నట్లు లాక్కుంటారేమో!”.

ఆనాటి ఆయన ఊహ అక్షరాలా నిజమైంది. శ్రీ సాయినాథుడు శ్రీ భరద్వాజగారిని తమ ఉచ్చులో బిగించి ఆయన జీవన రథసారథియై ఆయన జీవితాన్నంతా తమ స్వంతం చేసుకున్నారు. ఆయన శ్రీ సాయినాథునికి దాసానుదాసులై, శాశ్వతంగా ఆయనకు అంకితమైపోయారు. చాలా సంవత్సరాలు గడిచిపోయాయి. శ్రీ అనంతాచార్యగారి కుమారులు పెరిగి పెద్దవారైనారు. ఐ.ఏ.ఎస్. ఆఫీసర్ గా పనిచేస్తున్న శ్రీ వేదవ్యాస్ గారు ఒకసారి ఏదో ఒక ఊరికి క్యాంప్ కి వెళ్తూ తన తమ్ముడైన శ్రీ భరద్వాజగారిని కూడా వెంట తీసుకొని వెళ్ళారు. తిరుగు ప్రయాణంలో లక్ష్మీనరసమ్మగారి గ్రామం మీదుగా వెళ్తూ వారిని చూడాలనిపించి, వారింటికి వెళ్ళారు. అది సాయం సమయం. కొద్దిసేపు వారితో సంతోషంగా గడిపిన అనంతరం శ్రీ వేదవ్యాస్, శ్రీ భరద్వాజ తిరుగు ప్రయాణమయ్యారు. మావుళ్ళయ్యగారు వారితో ఫలహారం చేసి వెళ్ళవలసిందిగా బలవంతం పెట్టారు. అంతేకాక వారికిష్టమైన ఫలహారాన్ని పెట్టదలచానని, ఏది కావాలో నిస్సంకోచంగా అడగవలసినదనీ అన్నారు మావుళ్ళయ్యగారు. “ఇంట్లో వున్నదేదో పెట్టండి. అంతేకానీ మేము కోరినది యిప్పుడు తయారుచేయించి పెట్టాలనుకోవద్దు. మీరు అంత శ్రమ పడద్దు” అన్నారు శ్రీ వేదవ్యాస్. “మేము యిప్పుడు తయారు చేయించనవసరం లేదు. మీరు ఏది కోరితే అది మీకు వెంటనే పెట్టగలము” అన్నారు మావుళ్ళయ్యగారు. ‘అదెలా సాధ్యం?” అనుకొని, “మనకు యిష్టమైనది పెట్టగలనని యింతగా ప్రగల్భాలు పలుకుతున్నారు. ఆయన వెంటనే తయారుచేయలేని పదార్థాన్ని కావాలని అడుగుదాము. అప్పుడు ఏమి చేస్తారో చూడాలి” అని అన్నదమ్ములిద్దరూ కూడబలుక్కొని, “మాకిప్పుడు బొబ్బట్లు కావాలి” అన్నారు. ఆయన వెంటనే లోపలికి వెళ్ళి, ఒక గిన్నె నిండుగా వేడివేడిగా వున్న బొబ్బట్లను తీసుకొచ్చారు. “మేము బొబ్బట్లు అడుగుతామని మీకెలా తెలుసు?”అన్నారు శ్రీ వేదవ్యాస్. అప్పుడాయన యిలా చెప్పారు – “మాకు శ్రీ సాయిబాబా ప్రత్యక్ష సాక్షాత్కారమిస్తుంటారు. ఈ రోజు బాబా కన్పించి, ‘ఈ రోజు సాయంత్రం నేను మరిద్దరితో కలిసి మీ యింటికి వస్తున్నాను. ముగ్గురికీ ఒక్కొక్కరికీ ఆరు చొప్పున పద్దెనిమిది బొబ్బట్లు చేసి సిద్ధంగా వుంచు’ అని చెప్పారు”. ఆ మాటలు విన్న శ్రీ వేదవ్యాస్, శ్రీ భరద్వాజగార్ల ఆశ్చర్యానికి అంతులేదు. అయితే బాబా చెప్పిన ఆ మూడవ వ్యక్తి ఎవరని ఆలోచించిన వీళ్ళు బయట నిలిచివున్న కారు డ్రైవరుగా గుర్తించారు. ముస్లిం అయిన ఆ వ్యక్తి రంజాన్ సందర్భంగా రోజంతా ఉపవాసం వుండటం వలన అతనిని కూడా ఫలహారం చేయమని ఆహ్వానించటంతో అతడెంతో సంతోషంగా వీరితోపాటు ఫలహారం స్వీకరించాడు. ఈ బాబా లీలకు అందరూ ఎంతో ఆశ్చర్యాన్ని, ఆనందాన్నీ పొందారు.

**- సశేషం**

*(గత సంచిక తరువాయి)*

# శ్రీశ్రీశ్రీ మాతా ఆనందమయి జీవితం మరియు బోధలు

**శ్రీమతి శ్రీదేవి**

శ్రీ ఆనందమయి మాత ఆశ్రమం వదిలి వెళ్లిన నాటినుండీ అమ్మ యెడబాటు భరించలేక అమ్మ యెక్కడ వున్నారో జాడ కూడా తెలియక బాధపడుతున్న భక్తులకు జ్యోతిష్ దాదా రాక యెంతో వూరట నిచ్చింది. అయినా భక్తులంతా అమ్మ తిరిగి యెప్పుడొస్తారా అనుకుంటూ చంద్రుని కోసం చకోర పక్షుల లాగా అమ్మ రాక కోసం యెదురు తెన్నులు చూడసాగారు.

జ్యోతిష్ దాదా ఢాకా వెళ్ళిన తర్వాత కొద్ది రోజులకు శ్రీ భోలానాథ్ గారు అస్వస్థులైనారు. అమ్మకు కూడా జ్వరం రావడం మొదలైంది. అందువలన జ్యోతిష్ దాదా మరలా వుద్యోగానికి సెలవు పెట్టి రాయపూర్ వచ్చాడు. డెహ్రాడూన్ నుండి డాక్టర్ని పిలుచుకొని వచ్చి శ్రీ భోలానాథ్ గారికి చికిత్స చేయించి, వారికి కొంత స్వస్థత చేకూరగానే తిరిగి ఢాకా వెళ్ళిపోయాడు జ్యోతిష్ దాదా.

సుమారు 6, 7 నెలల అనంతరం శ్రీ ఆనందమయి మాత - శ్రీ భోలానాథ్ గారు, కమలాకాంత్ లతో - కార్తీకమాసంలో, రాయపూర్ నుండి తారాపీర్ వచ్చారు. అమ్మ ఆదేశం ప్రకారం వారు తారాపీర్ కు వస్తున్నట్లు యెవరికీ తెలియనివ్వక గోప్యంగా వుంచారు. అయినా యెలాగో భక్తులందరికీ అమ్మ తారాపీర్ వచ్చినట్లు తెలిసింది. కానీ అమ్మ అనుమతి లేకపోవడంతో యెవరూ అమ్మ వద్దకు వెళ్లేందుకు సాహసించలేకపోయారు. కలకత్తా నుండి నందూ మాత్రం ధైర్యం చేసి అమ్మ అనుమతి లేకుండానే తారాపీర్ వచ్చేసాడు. అమ్మ కూడా నందూ వచ్చినందుకు యేమీ అభ్యంతరం చెప్పలేదు. అతడిని వెనకకు పంపనూ లేదు. ఆ తర్వాత మనోరమ అక్కను, జ్యోతిష్ దాదాను అమ్మ తారాపీర్ పిలిపించుకున్నారు. ఒకటిన్నర నెలల తర్వాత తారాపీర్ నుండి వీరందరితో కలిసి 'నలహాటి' అనే ప్రదేశానికి వెళ్లారు అమ్మ.

జ్యోతిష్ దాదా వున్నత విద్యావంతుడు. ప్రభుత్వంలో వున్నత పదవిలో వుద్యోగ బాధ్యతలు నిర్వర్తిస్తున్నప్పటికీ నిష్ఠ నియమాలతో అమ్మ ఆదేశాలను పాటిస్తూ ఆధ్యాత్మిక సాధనలో త్వరితగతిన యెంతో పురోగతి సాధించాడు. మొట్టమొదటి దర్శనంతోనే అమ్మలోని దైవత్వాన్ని గుర్తించి అమ్మకు గొప్ప భక్తుడిగా మారిపోయాడు. రోజులో యెక్కువ భాగం అమ్మ సన్నిధిలోనే గడిపేవాడు. కొన్నాళ్లకు అమ్మ ఆయనకు యజ్ఞాగ్ని సేవలు విధించారు. అంతేకాక ధ్యాన జప విధానాలను వుపదేశించి తన వంట తానే చేసుకుని భుజిస్తూ ఆశ్రమంలోనే నివాసం వుండాలని చెప్పారు అమ్మ. అమ్మ ఆదేశాలను తు.చ. తప్పక పాటిస్తూ ఆశ్రమంలోనే వుండసాగాడు జ్యోతిష్ దాదా. ఇంటికి వెళ్లకుండా ఆఫీసుకు ఆశ్రమం నుండే వెళ్లిరావటం ప్రారంభించాడు. అతనికి భార్య, పిల్లలు వున్నారు. అతని భార్యకి అతని జీవన విధానం యేమాత్రం నచ్చేది కాదు. తన భర్తలో వచ్చిన యీ మార్పుకు కారణమైన శ్రీ ఆనందమయి అమ్మను కూడా ఆమె తీవ్రంగా ద్వేషించ సాగింది. అమ్మ ఒకసారి ఆమె యింటికి వెళ్లి ఆమె మనసులోని ద్వేష భావాన్ని తొలగించాలని యెంతగానో ప్రయత్నించారు. జ్యోతిష్ దాదా గురించి, ఆయన ఆధ్యాత్మిక జీవనం గురించి ఆమెకు అర్థమయ్యేలాగా యెంతో ఓర్పుగా వివరించారు. ఆమెతో యెంతో అనునయంగా, ప్రేమగా మాట్లాడుతూ ఆమెకు నచ్చ

చెప్పాలని, ఆమె మనసు మార్చటానికి ప్రయత్నించారు. కానీ ఆమెలో యేమాత్రం మార్పు రాలేదు. తన భార్య ప్రవర్తనకు బాధపడుతూ ఆమెలో మార్పు తీసుకురావడానికి ప్రయత్నిస్తూనే వున్నాడు జ్యోతిష్ దాదా. తాను మాత్రం అమ్మ సన్నిధి వీడక, అమ్మయే తన సర్వస్వంగా భావిస్తూ, అమ్మ ఆదేశాలను త్రికరణ శుద్ధిగా పాటిస్తూ ఆధ్యాత్మిక సాధనలో పురోగతి సాధించిన భాగ్యశాలి జ్యోతిష్ దాదా.

అమ్మ రమణాశ్రమం విడిచి వెళ్లి పది నెలలు కాలం గడిచిపోయింది. ఇంకా అమ్మ తిరిగి రానేలేదు. ఎప్పుడు వస్తారో సూచనగా అయినా తెలియదు. రమణాశ్రమం లోని భక్తులంతా అమ్మకు సన్నిహిత భక్తులుగా యింతకాలం అమ్మ సహచర్య భాగ్యం అనుభవిస్తూ ఆనందంగా గడిపి, యిప్పుడు నెలలు తరబడి అమ్మ దర్శన భాగ్యం కూడా లేక తల్లడిల్లిపోయారు. రానురాను అమ్మ యెడబాటు వారికి సహించరానిదిగా పరిణమించింది. సర్వాంతర్యామి అయిన అమ్మకు వీరి బాధ తెలియకుండా వుంటుందా?

ఒకరోజు నందూ అమ్మ ప్రక్కనే కూర్చుని "అమ్మా! మిమ్మల్ని ఒక విషయం అడగవచ్చునా?" అన్నాడు. "ఏమిటో చెప్పు" అన్నారు అమ్మ. "అమ్మా! మీరు ఢాకా విడిచి దాదాపు సంవత్సరం కావస్తున్నది. ఆశ్రమంలోని వాళ్లందరూ మిమ్మల్ని ఒక్కసారైనా దర్శించాలని ఆత్రుత చెందుతున్నారు. దయతో వారు యిక్కడికి వచ్చి మిమ్మల్ని దర్శించేందుకు అనుమతించండి. ఇంత కాలంగా వారు మీ సన్నిధి భాగ్యం లేక యెంతగా బాధపడుతున్నారో మీకు తెలియదా?" అన్నాడు నందూ. అమ్మ జవాబు యివ్వలేదు. "నందూ! నువ్వు యిలా మాట్లాడకు. ఇది సమయం కాదు" అని మాత్రం అన్నారు. అయినా నందూ పట్టు విడువక వరుసగా ప్రతిరోజు అమ్మను ఈ విషయమై ప్రాధేయపడసాగాడు. చివరికి అమ్మ అంగీకరించడంతో నందూ వెంటనే రమణాశ్రమంలోని వారికి, కలకత్తాలోని భక్తులందరికీ నలహాటి వచ్చి అమ్మను దర్శించుకోవలసినదిగా టెలిగ్రామ్ ద్వారా తెలియపరిచాడు. క్రమంగా కొద్ది రోజుల్లోనే నలహాటీలో అమ్మ వున్నారని, అమ్మ భక్తులందరిని అక్కడికి వచ్చేందుకు అనుమతించారని అన్ని ఊర్లలోని భక్తులకు తెలిసిపోయింది. అందరూ మహదానందంతో నలహాటీకి చేరుకున్నారు.

నలహాటీలో వున్న శివాలయం ప్రక్కనే వున్న ఒక పాత బంగాళాలో అమ్మ విడిది చేశారు. అమ్మ భక్తులంతా నలహాటి వచ్చి అమ్మను దర్శించుకున్నారు. భక్తులు అమ్మను దర్శించే సమయంలో అమ్మ తలపై నుండి వంటి నిండుగా ఒక పెద్ద కంబళి కప్పుకొని వున్నారు. బంగళా ముందర ఆరుబయట పచ్చికలో కూర్చుని వున్న అమ్మ చుట్టూ కూర్చుని భక్తులు అమ్మతో సంభాషించసాగారు. రాయపూర్ లో అమ్మకు జ్వరం వచ్చింది. ఆ తర్వాత శ్రావణ భాద్రపద మాసాలలో అమ్మ పూర్తిగా మౌనవ్రతంలో వున్నారు. ఈ కారణాల వలన అమ్మ బలహీనంగా, నీరసంగా కనిపించారు. మౌనవ్రతం పాటించటం వలన, మాట పెగలక హీనస్వరంతో తడబడుతూ మాట్లాడసాగారు. అయినా నవ్వుతూ అందరిని ఆప్యాయంగా పలకరించసాగారు. ప్రతిరోజు వరుసగా ప్రవాహం వలె అమ్మ దర్శనం కోసం వచ్చే భక్తులతో నలహాటి గ్రామం ఒక తీర్థ క్షేత్రం వలె మారిపోయింది. అమ్మ విడిది చేసిన బంగళా భక్తుల రద్దీతో కిటకిట లాడిపోయింది.

నలహాటీ లో రెండు వారాలు గడిపి అమ్మ మరల రాయపూర్ వెళ్లాలని సంకల్పించారు. వెళ్లేముందు మరల భక్తులకు వారి సాధనల గురించి తగిన ఆదేశాలు యిచ్చారు. ఒక్కొక్కరికి విడివిడిగా వారి వారి సాధనా విధానాల ననుసరించి వారు పాటించవలసిన నియమ నిష్ఠలను వివరించారు. మనోరమ అనే భక్తురాలు గొప్ప సాధకురాలు. ఆమె వివాహిత. ఆమె అదృష్టం యేమిటంటే ఆమె శ్రీ ఆనందమయి అమ్మ వంటి సద్గురువును ఆశ్రయించి ఆమె పర్యవేక్షణలో తీవ్రసాధన చేయడంలో ఆమె భర్త ఆమెకు తన పూర్తి సహకారాన్ని అందించడమే! ఆమెలోని ఆధ్యాత్మిక పిపాసను గుర్తించి ఆమెను యింటికే పరిమితం చేసి నిర్బంధించక విశాల హృదయంతో ఆమె స్వేచ్ఛగా ఆధ్యాత్మిక సాధన చేసుకొనేందుకు అతడు అనుమతించాడు. అతని అంగీకారం పొంది కొన్నాళ్లు యింటిని వీడి రమణాశ్రమంలో అమ్మ సన్నిధిలో వుండిపోయింది మనోరమ. నలహాటీలో అమ్మను దర్శించి అమ్మ సన్నిధిలో వున్న సమయంలో అమ్మ మనోరమకు సాధనలో కొన్ని మార్గ నిర్దేశకాలను తెలియజేశారు. అందులో ముఖ్యమైనది– మనోరమ కాశీ వెళ్లి అక్కడ తన సాధన కొనసాగించాలన్న విషయం. మనోరమ భర్త అనుమతితో నలహాటీ నుండి నేరుగా కాశి వెళ్ళిపోయింది. ఇక ఆ తర్వాత ఆమె తన యింటికి తన భర్త చెంతకు ఒక్కసారి కూడా వెళ్లలేదు. ఆమె పూర్తిగా గృహత్యాగం చేసి సన్యాసినిగా మారిపోయింది. కాలాంతరంలో ఆమె శ్రీ ఆనందమయి అమ్మ ఆశీస్సులతో గొప్ప ఆధ్యాత్మికోన్నతిని సాధించింది.

**- సశేషం**

# ద్వారకామాయి అనుభవమండపము

శ్రీమతి సరోజని, బాపట్ల

సం|| 2005 ప్రాంతంలో మావారికి పని సరిగ్గా దొరక్క, కొంచెం ఆర్థిక ఇబ్బందుల్లో ఉండే వాళ్ళం.అప్పుడు వేణుగోపాలరావుగారని ఒకాయన, "మీరు, శ్రీ సాయిలీలామృతము గ్రంథం పారాయణ చేయండి, బాబా దయవల్ల తప్పకుండా మంచి పని దొరుకుతుంది" అని చెప్పారు. అదేవిధంగా మొట్టమొదటిసారి, ఒక గురువారం పారాయణ మొదలు పెట్టాను. ఆరోజు రాత్రి బాగా చీకటి పడ్డాక డాబా మీద పడుకుందామని పైకి వెళ్ళాను. మేమున్న ఇంటి దగ్గర ఎక్కువ ఇళ్ళు లేవు. మావారు పని దగ్గర నించి ఇంకా ఇంటికి రాలేదు. పైకి వెళ్ళాక చుట్టూ చూస్తే చాలా భయమేసింది. నేను చాప, దిండు వేసుకుని భయపడుతూనే పడుకోబోతున్నాను... ఇంతలో ఎవరో వస్తున్న చప్పుడు వినిపించింది. బాబా నిజంగానే, నేను చూస్తుండగానే మెట్లు ఎక్కి డాబా పైకి వచ్చారు. కఫ్నీ, తలకి గుడ్డ, చేతిలో సటకా ఉన్నాయి, చీకట్లో మొహం అస్పష్టంగా కనిపించింది. ఒక్కసారిగా ఒళ్ళు గగుర్పొడిచింది. అలా చూస్తుండగానే, వారు నా తల దగ్గరకొచ్చి కూర్చున్నారు. నాకు నిద్ర పట్టేసింది. మొదటి రోజే ఇంతటి ప్రత్యక్ష దర్శనాన్ని అనుగ్రహించినందుకు బాబావారి పట్ల విపరీతమైన నమ్మకం, ప్రేమ కలిగాయి. తరవాత నిజంగానే మావారికి మంచి పని దొరికింది.

వేణుగోపాలరావు అంకుల్ ద్వారానే, కోటేశ్వర రావు అంకుల్ సత్సంగం పరిచయం అయ్యింది.

శ్రీ సాయిలీలామృతం పూర్తయిన వెంటనే 'శ్రీ గురుచరిత్ర' గ్రంథం చదవాలని బాగా కోరిక ఉండేది. అయితే అప్పట్లో చాలామంది, 'ఆడవాళ్లు ఈ గ్రంథం చదవకూడదు' అని చెప్పారు. నాకేమో ఆ గ్రంథం చదవాలని బాగా కోరికగా ఉండేది. ఒకరోజు ఈ విషయం బాబాకు చెప్పుకుని పడుకున్నాను. ఆరోజు బాబా స్వప్న దర్శనమిచ్చి, "ఆ గ్రంథం తప్పకుండా చదువు, వెల 55 రూపాయలు" అని చెప్పారు. అప్పటినించి శ్రీగురుచరిత్ర కూడా పారాయణ చేయడం మొదలు పెట్టాను. అది ఇప్పటి వరకు కొనసాగుతోంది.

మాకు ఒక బాబు, ఒక పాప. 2009 లో మా పాపని 3వ నెల గర్భవతి గా వున్నప్పుడు, మా సత్సంగ సభ్యులందరము కలిసి శిరిడి వెళ్ళడానికి టిక్కెట్లు ముందుగా కేటాయించుకున్నాము. కానీ నాకు రక్తస్రావం అవ్వడంతో వైద్యులు 'ప్రయాణం చేయొద్దు' అన్నారు. నాకు చాలా బాధవేసింది. ఆరోజు రాత్రి కలలో,,, మా సత్సంగ సభ్యులందరము శిరిడి లో సమాధి మందిరంలో బాబా చుట్టూ నిలబడ్డాము. మా అందరికి బాబా కిళ్లీలు ప్రసాదంగా ఇస్తున్నారు. ఆవిధంగా స్వప్నం వచ్చిన తరువాత 'ఇంకేమి? బాబా ఆశీస్సులు ఉన్నాయని' అందరూ అనడంతో, నేను కూడా శిరిడి వెళ్ళిపోయాను.ఎటువంటి ప్రమాదం జరగలేదు. చక్కగా దర్శనం చేసుకుని తిరిగి వచ్చాను. 5వ నెలలో మళ్లీ రక్తస్రావం జరిగింది. అప్పుడు యంత్ర సహాయంతో పరీక్ష (స్కానింగ్)చేశారు. అందులో, 'అంతా బాగుంది, ప్రమాదం ఏమీ లేదని' తెలిసింది.. చిత్రంగా అందులో బేబీ తో పాటూ పక్కనే బాబా ఆకృతి నీడలా పడింది. అదిచూసి చాలా ఆశ్చర్యపోయాము. చివరికి బాబా దయతో పాప పుట్టింది. అంటే వారి రక్షణ వల్లే పాప పుట్టిందని నిరూపణ ఇచ్చారు.

మొన్న వచ్చిన కోవిడ్ సమయంలో మావారికి కరోనా వచ్చింది. పైగా పనికి వెళ్లడానికి అవకాశం లేదు గనుక, ఇటు శారీరకంగా, అటు ఆర్థికంగా చాలా ఇబ్బంది పడేవాళ్ళం.

అప్పుడు బాబా మావారికి కలలోకి వచ్చి, "నా సహాయం నీకు వేరొకరి ద్వారా అందుతుంది, భయపడకు" అని చెప్పారు. అదేవిధంగా, మా బాపట్ల సత్సంగ సభ్యుల కోసం ఉచిత హోమియో మందు ఏర్పాటు, ఆర్థిక ఇబ్బందులలో వున్న మాలాంటి వారికి ధన సహాయం, పూజ్యశ్రీ అమ్మగారి ద్వారా మాకు లభించింది. బైట ఆసుపత్రికి వెళ్లకుండా ఆ హోమియో మందు, తినడానికి ఇబ్బంది లేకుండా అమ్మ చేసిన ఆర్థిక సహాయం మమ్మల్ని ఎంతగానో ఆదుకున్నాయి. అంతేకాదు శ్రీ బాబాగారు, పూజ్యశ్రీ అమ్మగారు ఒక్కటేనని నిరూపణ కూడా జరిగింది.

చివరిగా ఈ సంవత్సరం అంటే 2024 వ సంవత్సరం, ఏప్రిల్ నెలలో ఒకరోజు మావారు, బైటికి వెళ్ళడానికి స్కూటరు తీసి, దాన్ని కాలితో నెడుతుంటే, కాలు జారి బండికి తగిలి, పెద్ద గాయం అయ్యి చర్మం చీరుకుపోయింది. వెంటనే ఆసుపత్రికి వెడితే, కుట్లు వేసి, 'ఒక వారం ఇంట్లో వుండాలి' అన్నారు. పనికి వెళ్లకుండా ఇంట్లో వుండటం కుదరదని, కట్టుకట్టించుకుని ఇంటికి వచ్చేసారు. నేను రోజూ కట్టు మార్చి కడుతుండేదాన్ని. ఇలా ఒక నెల అయినా ఆ గాయం తగ్గలేదు. తగ్గేవరకు పనికి వెళ్లకుండా ఇంట్లోనే వుండిపోయే పరిస్థితి లేదు. మే నెలలో వచ్చిన శ్రీ సాయిలీలామృతము కృతజ్ఞతార్చన రోజు పూజ అయిపోయాక, "మావారి కాలి గాయం మానిపోవాలని, దానికోసం టీ మానేసి సప్తాహ పారాయణలు చేస్తానని, మీరు తప్ప మాకు దిక్కెవ్వరూ లేరని", బాబావారికి మొక్కుకున్నాను. అదేరోజు నించి పారాయణ మొదలు పెట్టాను. ఈ పారాయణ హడావిడిలో మావారి కాలికి కట్టుకట్టడం మర్చిపోయాను. కొన్ని రోజుల తరువాత మావారికి స్వప్నం లో బాబా దర్శనమిచ్చి, కాలికి తగిలిన గాయానికి కుట్లు వేశారట. మావారు నాతో ఈ విషయం చెప్పాక, నేను కట్టుకట్టడం మర్చిపోయానని గుర్తుకొచ్చి, కట్టువిప్పి చూస్తే, చర్మం అతుక్కుపోయి, గాయం చక్కగా నయమై పోయింది. మా ఆనందానికి అవధులు లేవు.

ఈ విధంగా ఇంకెన్నో సందర్భాలలోకూడా, సమర్థ సద్గురు సాయినాథుడు, మమ్మల్ని ఎంతగానో ఆదుకుని అక్కున చేర్చుకుంటున్నందుకు, ఆ తండ్రికి మా హృదయపూర్వక పాదాభివందనములు!! ●

## మాతృదేవి సన్నిధిలో గురుపూర్ణిమ

13వ పేజీ తరువాయి

అర్థం అయినది ఏమిటంటే, ఈరెండూ ఒకే భావనకు సంబంధించిన వివరణలు అని!! కుంభవృష్టి కురిసి పంటలన్నీ పండే సమయంలో 'ఆహా ' అనిపించి హృదయం పులకించినరోజు గురుపూర్ణిమ, పండిన పంటంతా పక్వానికి వచ్చి తృప్తిగా ఆస్వాదించాక 'హమ్మయ్య' అని అనిపించిన రోజు దత్తజయంతి!

గురుపూర్ణిమకు సాకార రూపం బాబా, మాస్టరుగారు. ఆ గురుశిష్యులలో లేని ఉత్తమ లక్షణాలు వేరెక్కడా కనపడవు. ఈరోజున వాళ్ళ వాగ్దానం ఏమిటంటే, విశ్వమంతా నడిపే శక్తిలో పరిపూర్ణంగా లయించి, దాంట్లో భాగంగా నడుస్తూ దేవుడని దేనినైతే అంటున్నామో ఆస్థితిలో మనల్ని వుంచుతారు. మనందరికీ ఏది కావాలో అది ప్రసాదించడానికి వచ్చారు ఆ గురుశిష్యులు. తక్కిన వారందరిలో వారేమి చూస్తున్నారో అది చూడ్డం నేర్చుకోగలిగితే, గురుపూర్ణిమ సార్థకమైనట్లు!

ఈగురుపూర్ణిమసందర్భంగావారిభక్తులైనమీఅందరినీ వారి స్వరూపాలుగా భావించి మనస్పూర్తిగా నమస్కారాలు తెలుపుకుంటున్నాను. సకల సృష్టి గురురూపమై నన్ను సదా కాపాడి సన్మార్గంలో నడుపుతున్నందుకు కృతజ్ఞతలు తెలుపుకుంటూ, అద్వితీయమైన పూర్ణ దత్తావతారమైన శిరిడి సాయినాథుల వారికి, వారి స్వస్వరూపం, వారి శిష్యోత్తముడూ అయిన భరద్వాజ మహరాజ్ గారికి, భరద్వాజ మహరాజ్ గారి హృదయాంతర్వర్తి అయిన అమ్మగారికి పాదాభివందనములు చేస్తూ, గురుపూర్ణిమ సందర్భంగా ప్రత్యేక అనుగ్రహం ప్రాప్తించి, సుఖశాంతులు, ఆయురారోగ్యాలు, అష్టైశ్వర్యాలు, ఆధ్యాత్మికత, గురుభక్తి కలగాలని ప్రార్థిస్తూ సెలవు తీసుకుంటున్నాను" అంటూ వారి సత్సంగాన్ని ముగించారు.

తదుపరి భక్తులందరు ఆ ముగ్గురు మూర్తులకు నమస్కరించుకుని భోజన ప్రసాదం ఆరగించి, మాతృదేవి సన్నిధినించి బయలుదేరడంతో గురుపూర్ణిమ ఉత్సవాలు ముగిశాయి.●

# ఆచార్యుని అద్భుత లీలలు

శ్రీమతి స్వాతి, గుంటూరు

పూజ్యశ్రీ భరద్వాజ గురుదేవుల లీలావైభవాన్ని గుంటూరు వాస్తవ్యురాలు శ్రీమతి స్వాతిగారు ఈవిధంగా తెలియచేస్తున్నారు....


మా పుట్టిల్లు గుంటూరు. నేను 2001వ సంవత్సరంలో వివాహమై గుంటూరునుంచి హైదరాబాదుకు వెళ్ళిపోయాను. 2002 వ సంవత్సరంలో నాకు గర్భస్రావమైంది. వైద్యులు పరీక్షించి నాకు మళ్ళీ గర్భం రావడం కష్టమని చెప్పారు. నేను చాలా బాధపడ్డాను.

మా అమ్మ అప్పుడప్పుడూ నల్లపాడులోని నాగసాయి మందిరంలో జరిగే సత్సంగాలకు వెళ్తుండేది. అప్పుడు సత్సంగసభ్యులలో ఒకరైన శేషమ్మగారు మా అమ్మ ద్వారా నా సమస్య విని, "మీ అమ్మాయిని శ్రీ సాయిలీలామృతం సప్త సప్తాహాలు పారాయణ చేయమనండి. బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు తప్పకుండా ఆమెకు సంతానాన్ని ప్రసాదిస్తారు" అని చెప్పారు. అదే సమయంలో నేను గుంటూరుకు వెళ్ళాను. అప్పుడు ఆవిడ నాకు శ్రీసాయిలీలామృతం, శ్రీగురుచరిత్ర గ్రంథాలిచ్చి పారాయణ చేసుకోమని చెప్పారు.

నాకు అంతా అయోమయంగా అనిపించింది. ఎందుకంటే నేను ఎప్పుడూ పారాయణ చేయలేదు. వైద్యుల సైన్సును నమ్మాలో లేక బాబాను నమ్మాలో అర్థం కాలేదు. ఎటూ తేల్చుకోలేక ఈ విషయమై రెండు చీటీలు వ్రాసి, మా ఇంటిపక్కన వున్న ఒక సంవత్సరం వయసున్న బాబుచేత మూడుసార్లు చీటీలు తీయిస్తే, మూడుసార్లూ సప్త సప్తాహాలు పారాయణ చేయమనే వచ్చింది! ఇక మందులు, వైద్యుల నిర్ధారణ అన్నీ పక్కన పెట్టేశాను. మర్నాడే శ్రీసాయిలీలామృతం ఏకాహ పారాయణ, ఆ మర్నాడే శ్రీ గురుచరిత్ర ఏకాహ పారాయణ చేసుకుని హైదరాబాదుకు వెళ్ళిపోయాను. అక్కడ సప్త సప్తాహాలు శ్రీసాయిలీలామృతం పారాయణ మొదలుపెట్టాను.

ప్రతివారం బుధవారంనాడు పారాయణ పూర్తయ్యేసరికి ఎవరో ఒకరు భోజనానికి వచ్చేవారు! అంతేకాకుండా పూజ చేస్తుంటే బాబా, పూజ్యశ్రీ మాస్టరుగారు అక్కడకు వచ్చి కూర్చున్నారనిపించేది! చాలా చక్కటి భావంతో పూజ చేసుకునేదాన్ని. సరిగ్గా 5 వారాలు పూర్తయ్యేసరికి నేను గర్భవతిని అని తెలిసింది! అది ఫిబ్రవరి నెల. ఇక నా ఆనందానికి అవధులు లేవు. 'ఈ కాలంలో సైన్సుని, వైద్యులు చెప్పిన విషయాన్ని పక్కనపెట్టి పూజ్యశ్రీ మాస్టరుగారు వ్రాసిన బాబా చరిత్ర చదివితే ఇంతటి ఫలితమా! మహాత్ములంటే వీళ్ళు కదా!' అనిపించింది. అప్పుడు వైద్యుల దగ్గరకు వెళ్తే వారు కూడా చాలా ఆశ్చర్యపోయి, తొమ్మిది నెలలూ పూర్తి విశ్రాంతి తీసుకోవాలని చెప్పారు.

నేను వెంటనే గుంటూరులోని మా పుట్టింటికి వచ్చేశాను. పారాయణ మాత్రం ఆపకుండా చేస్తూనే వున్నాను. మూడు నెలలు నిండి నాలుగవ నెల వచ్చేసరికి భయం పట్టుకుంది. ఎందుకంటే అంతకుముందు గర్భస్రావమైనది నాలుగవ నెలలోనే! ఒకరోజు నాకొక స్వప్నం వచ్చింది. అందులో నేను బాబా పాదాలు, పూజ్యశ్రీ మాస్టరుగారి పాదాలు పట్టుకుని బాగా ఏడుస్తున్నాను. 'నాకెందుకు భయమేస్తోంది?! వైద్యుల మాట కూడా పక్కన పెట్టి మిమ్మల్నే నమ్ముకున్నాను. మరి ఇప్పుడెందుకు భయంగా వుంద'ని ఏడుస్తుంటే, నాకు పూజ్యశ్రీ మాస్టరుగారి పాదాలు మెత్తగా తగిలాయి. పూజ్యశ్రీ మాస్టరుగారు కనపడి నన్ను ఒళ్ళో పడుకోపెట్టుకుని నా తల నిమురుతూ, ''భయమెందుకు తల్లీ? నేనున్నాను కదా! నా ప్రసాదం నీకు పూర్తిగా అందుతుంది" అని లేచి పక్కకి జరిగారు. వారి వెనకాల విజయవాడ కనకదుర్గ అమ్మవారిలా వున్న అందమైన అమ్మాయి వుంది. పూజ్యశ్రీ మాస్టరుగారు



ఆ అమ్మాయిని చూపిస్తూ, “ఇంతటి బంగారంలాంటి అందమైన అమ్మాయిని నీకు ప్రసాదించబోతున్నాను. భయపడవద్దు. ఈ క్షణంనుంచి నీకు భయమనేదే లేకుండాపోతుంది” అన్నారు. మెలకువ వచ్చేసింది. మర్నాటినుంచి ఎంత ధైర్యం వచ్చిందంటే పురిటికి వెళుతూ కూడా చాలా ధైర్యంగా వెళ్లాను. చివరివరకు పారాయణ చేసుకుంటూనే వున్నాను.

అయితే నేను ప్రతి నెలా పరీక్షలు చేయించుకునే ప్రైవేటు ఆసుపత్రి వైద్యులు నాకు సిజేరియన్ తప్పదని, డబ్బులు సిద్ధం చేసుకోమనీ చెప్పారు. మాకు అంత స్తోమత లేదు. ఏమి చేయాలో తెలియలేదు. అప్పుడొక అద్భుతమైన లీల జరిగింది. ఒకరోజు మా అమ్మ శేషమ్మగారింటికి సత్సంగానికి వెళ్ళింది. సత్సంగం అయిపోయాక అక్కడ వున్నవారితో నా పరిస్థితి వివరిస్తూ వుండగా ఇదంతా వింటున్న ఒకావిడ మా అమ్మతో, “మీరు ప్రభుత్వ ఆసుపత్రి అని అనుకోకపోతే ఒకసారి మా ఆసుపత్రికి రండి. నా పేరు ఝాన్సీ. నేను అక్కడ ల్యాబ్ టెక్నీషియనుగా పనిచేస్తాను. రేపు మీరు అక్కడికి వస్తే మీ అమ్మాయిని ఒక మంచి లేడీడాక్టర్ దగ్గరకు తీసుకువెళతాను. ఆవిడ కూడా సిజేరియన్ అని చెప్తే అప్పుడే మీరు ప్రైవేటు ఆసుపత్రికి తీసుకెళ్లవచ్చు!” అని అన్నారు. మా అమ్మ నాతో ఇదంతా చెప్పి నన్ను ఆసుపత్రికి తీసుకెళ్లింది. నేను కొంచెం అయిష్టంగానే అక్కడకు వెళ్లాను. కానీ తీరా వెళ్ళాక నా అభిప్రాయం ఎంత తప్పో అర్థమైంది. ఆ ఆసుపత్రి చాలా బాగుంది. అక్కడ డాక్టరుగారు నాకు సుఖప్రసవం అవుతుందని, శస్త్రచికిత్స అవసరం లేదనీ చెప్పారు. మేము ఎంతో ఆశ్చర్యపోయాము. జరుగుతున్న పూజ్యశ్రీ మాస్టరుగారి లీల గమనిస్తే, ఆర్థికంగా ఇబ్బంది పడుతున్న మాకు సత్సంగం జరిగే చోటే పరిష్కారం చూపించి, మా వెంటవుండి నడిపిస్తున్న ఆ కరుణామూర్తి ప్రేమకి కళ్ళనీళ్ళొచ్చాయి. ఆ డాక్టర్ పర్యవేక్షణలోనే వుండి ఆమె చెప్పిన సమయానికి ఆసుపత్రిలో చేరాను. చేరిన రెండుమూడు రోజులకు మా బంధువులు శిరిడీకి వెళ్లి వచ్చి, ఒక గురువారంనాడు బాబా ఊదీ, ప్రసాదం తెచ్చి నాకు అందించారు! అది చూడగానే నాకు కన్నీళ్లు ఆగలేదు. ‘ఎంత శ్రద్ధగా బాబా నన్ను చూసుకుంటున్నారో కదా!’ అనిపించింది. మైనతాయి లీల గుర్తొచ్చింది. ఆ ప్రసాదం తీసుకోగానే నొప్పులు మొదలయ్యాయి. శుక్రవారం ఉదయమే సుఖప్రసవం జరిగి పూజ్యశ్రీ మాస్టరుగారు వరమిచ్చినట్లుగా నిజంగానే బంగారంలాంటి పాప పుట్టింది. అది నవంబర్ నెల. అందరూ పాపను చూసి, ‘పాప చాలా బాగుంది, మేము పెంచుకుంటాము ఇచ్చేస్తావా?’ అనడిగేవారు. పూజ్యశ్రీ మాస్టరుగారు చెప్పినట్లు మా పాప బంగారంలా వుంది కనుక, ‘హేమసాయిశ్రీ’ అని పేరు పెట్టాము. ఇదంతా 2004 లో జరిగింది.

2006లో మా అమ్మ, నాన్న హైదరాబాదులోని మల్కాజిగిరిలో వున్న పూజ్యశ్రీ అమ్మగారి దర్శనానికి వెళ్లారు. అప్పుడు అక్కడ ద్వారకబాబుగారు కూడా వున్నారు. మా అమ్మ పూజ్యశ్రీ అమ్మగారికి నమస్కరించుకుని, తరువాత బాబుగారికి కూడా నమస్కారం చేసుకుని అకస్మాత్తుగా, “బాబూ! మా అమ్మాయికి పాపని ఇచ్చారు. ఇక మీలాంటి బాబుని కూడా ఇస్తే, మీ పేరే పెట్టుకుంటాము” అని దణ్ణం పెట్టుకుంది! అలా అడగటం మా అమ్మకే ఆశ్చర్యం వేసింది. మేము బాబు కావాలని ఏమీ అనుకోలేదు. మా స్తోమతకి ఈ పాప చాలనుకున్నాము. అమ్మావాళ్ళు బాబుగారిని అడిగినది

ఫిబ్రవరి నెల. నేను అదే నెల గర్భం దాల్చాను. సరిగా నవంబర్ నెలలో మళ్ళీ మావాళ్లు శిరిడి వెళ్లివచ్చి ప్రసాదం తెచ్చిచ్చిన తరువాత సుఖప్రసవం జరిగి బాబు పుట్టాడు! ఇక ఏమీ ఆలోచించకుండా మా అమ్మ అనుకున్నట్లు వాడికి ద్వారకనాథ్ జ్ఞానేశ్వర్ అని పేరు పెట్టేశాము. అనుకోకుండా వాడి పేరులో మొదటి అక్షరం 'ద' తో వుండాలని తరవాత తెలిసింది! ఈవిధంగా అనేక ఆరోగ్య, ఆర్థిక సమస్యలతో సతమవుతున్న మాకు, వాటన్నింటిని పక్కకి నెట్టి పూజ్య గురుదేవులు ఇద్దరు పిల్లల్ని ప్రసాదించారు.

మేము పాప పుట్టాక హైదరాబాదునుంచి గుంటూరుకి మారిపోయాము. మావారు కూడా ఇక్కడే ఉద్యోగం చూసుకున్నారు. అయితే ఆర్థిక సమస్యల దృష్ట్యా నేను కూడా ఉద్యోగం చేయాలనుకున్నాను. మా పాప పుట్టేసరికి నేను 10 వ తరగతి మాత్రమే చదువుకుని వున్నాను. అందువల్ల మా ఇంటిపక్కనే వున్న పాఠశాలలో నెలకు 500 రూపాయల జీతానికి ఉద్యోగానికి చేరాను. ఒక చిన్న పాఠశాలలో 500 రూపాయల జీతానికి ఉపాధ్యాయురాలిగా చేరిన నేను, ఈరోజు ఒక మిషినరీ పాఠశాలలో 40,000 రూపాయలు సంపాదిస్తున్నాను. ఇదంతా కూడా పూజ్యశ్రీ మాస్టరుగారి కృపే!! నన్ను తీసుకెళ్లి పెద్ద శిఖరంపై కూర్చోపెట్టారు.

ఈ లీల తప్పకుండా చెప్పుకోవలసినది. నేను, చిన్న స్కూల్లో పనిచేస్తూనే, ప్రైవేటుగా డిగ్రీ పూర్తిచేశాను. ఒకరోజు ఆక్స్ఫర్డ్ పాఠశాల ముందునుంచి వెళుతూవుంటే ఒక్కసారి లోపలకు వెళదామనిపించింది. అది ఆగస్టు నెల. అప్పుడు టీచర్ ఉద్యోగాలు వుండవని తెలిసినా వెళ్లాను. చిత్రంగా నా సబ్జెక్టు అయిన సాంఘికశాస్త్రంలో పనిచేసే ఉపాధ్యాయుడు అప్పుడే మానెయ్యడం, నన్ను ఆ పదవి వరించడం జరిగిపోయాయి! అప్పటికీ మునుపటికన్నా మంచి జీతంతోనే చేరాను.

మా పిల్లలు లయోలా పాఠశాలలో చదువుకునేవారు. ఆ స్కూల్లో పనిచెయ్యడం కష్టమని, చాలా కఠినమైన నియమాలుంటాయనీ విన్నాను. అందుకని నాకు ఆ స్కూల్లో ఉద్యోగం చేయాలనిపించేది కాదు. ఇంతలో మా స్నేహితురాలు ఆ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా చేరింది. మా స్నేహితురాలు లయోలాలో చేరాక నాతో, "ఇప్పటివరకూ విన్నవన్నీ నిజం కాదు. ప్రతిభ వున్నవారికి ఇక్కడ మంచి భవిష్యత్తు వుంటుంది" అని చెప్పి, నన్ను కూడా అక్కడ ప్రయత్నం చేయమంది. అప్పుడు పూజ్యశ్రీ మాస్టరుగారి దగ్గర 'వెళ్ళాలా వద్దా?' అని మళ్ళీ చీటీలు వేశాను. వెళ్ళమని వచ్చింది. 2019 మార్చిలో దరఖాస్తు చేశాను. నిజానికి నా అర్హత చాలా తక్కువ. ప్రైవేటుగా చదివిన డిగ్రీ వుంది అంతే! B.Ed కూడా లేదు. కానీ పూజ్యశ్రీ మాస్టరుగారి అపారమైన కరుణ మాత్రం పుష్కలంగా వుంది. నన్నిక్కడికి పంపించారు, కనుక నాకు అవకాశం ఇచ్చి తీరుతారని నా నమ్మకం. నామం వదలకుండా జపిస్తూనే వున్నాను. దాదాపు 48 మంది సోషల్ డిపార్ట్మెంటులో డెమోకి వచ్చారు. నేను చివరిదాన్ని. అయినా పూజ్యశ్రీ మాస్టరుగారి అద్భుతమైన ప్రణాళికలో భాగంగా నాకు ఆ ఉద్యోగం వచ్చింది.

ప్రణాళిక అని ఎందుకు అంటున్నానంటే... కరోనా రాబోయే ముందరే నన్ను లయోలా పాఠశాలకు తరలించారు పూజ్యశ్రీ మాస్టరుగారు!! 2020 లో కరోనా వచ్చి దాదాపు అన్ని పాఠశాలలో ఉద్యోగస్తులకు జీతాలు ఇవ్వలేదు, ఆక్స్ఫర్డ్ స్కూల్లో కూడా! కానీ నేను పనిచేసే లయోలా పాఠశాలలో మాత్రం మేము పనిచేయకపోయినా జీతం ఇచ్చేవారు! ప్రతినెలా వచ్చే ఆ జీతాన్ని చూసుకుని, ఇది పూజ్యశ్రీ మాస్టరుగారి ప్రసాదం అనుకుంటూ ఏలోటూ లేకుండా గడిపేవారము. నేను నా జీవితంలో ప్రతీ విషయంలోనూ పూజ్యశ్రీ మాస్టరుగారి, బాబా అండదండలు సమృద్ధిగా పొందాను, పొందుతున్నాను.

ఇప్పటికీ ఏదైనా కష్టం వస్తే తలచుకుంటే చాలు, పరిష్కారం చూపిస్తారు. లేదా తట్టుకునే శక్తి అయినా ఇస్తారు. పూజ్యశ్రీ మాస్టరుగారికి నేను ఏవిధంగా కృతజ్ఞతలు తెలుపగలను?

గురుకుటుంబంతో మాకు అనుబంధం కలగడం నిస్సందేహంగా పూర్వజన్మ సుకృతం. పూజ్యశ్రీ అమ్మగారు కూడా నా తల్లిదండ్రుల్ని చాలా కష్టాలనుంచి కాపాడారు. మా కుటుంబమంతా గురుదంపతుల పాదపద్మాలను ఆశ్రయించుకుని ఎప్పటికీ కృతజ్ఞత కలిగివుండేలా దీవించమని గురుదంపతులను ప్రార్థిస్తున్నాను.

ఓం సంతానప్రదాయ శ్రీ భరద్వాజ సద్గురవే నమః!

జై సాయి మాస్టర్!!

# పరమ పూజ్య ఆచార్య శ్రీ ఎక్కిరాల భరద్వాజ మాస్టరుగారిచే రచించబడిన అపూర్వ ఆధ్యాత్మిక వైజ్ఞానిక గ్రంథములు

**SRI GURUPADUKA PUBLICATIONS, C/o. SRI MANGA BHARADWAJA TRUST**
Regd. Office: Bhakta Nivas, 12-1-170/46P, Hanuman Nagar, Jaipuri Colony, Nagole,Hyderabad - 500068, Phone: +91 7416041550
Branch Office : Kondalah Bunk Street, Kothapeta, Ongole, Prakasam Dist. Andhra Pradesh. Phone: 8597233271
*Send DD in favour of 'Sri Manga Bharadwaja Trust (Publications)' Payable at Hyderabad or Ongole*

### శ్రీ గురుని పై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ గురు చరిత్ర – శ్రీ సాయి లీలామృతము (బౌండ్) | ₹499.00 |
| శ్రీ గురు చరిత్ర | ₹199.00 |
| శ్రీ సంహితాయన గురు ద్విసాహస్రి | ₹149.00 |
| శ్రీ దత్తావతార మహాత్మ్యము | ₹75.00 |

### శ్రీ శిరిడీ సాయిబాబాపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి లీలామృతము | ₹199.00 |
| శ్రీ సాయి సన్నిధి | ₹199.00 |
| శ్రీ సాయినాథ ప్రబోధామృతము. | ₹119.00 |
| శ్రీ సాయినాథ పూజ | ₹49.00 |
| శిరిడీ హారతులు | ₹15.00 |
| శిరిడీ క్షేత్ర సందర్శనము | ₹49.00 |
| శ్రీ సాయినాథ స్తవన మంజరి | ₹10.00 |
| సాయిని పూజించడం ఎందుకు? | ₹10.00 |
| సత్సంగము – భజన | ₹10.00 |
| సాయి సూక్తి – ఆచార్యవాణి | ₹20.00 |
| శ్రీ సాయి నిత్య సత్య వ్రతము<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹20.00 |

### ఇతర మహాత్ముల గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ స్వామి సమర్థ | ₹75.00 |
| శ్రీ తాజుద్దీన్ బాబా | ₹75.00 |
| అవధూత శ్రీ వెంకయ్య స్వామి | ₹99.00 |
| అవధూత శ్రీ చీరాల స్వామి | ₹75.00 |
| శ్రీ పాకలపాటి గురువుగారు | ₹75.00 |
| శ్రీ ఆనందమయి అమ్మ | ₹75.00 |
| టిబెట్ యోగి మిలారేపా చరిత్ర | ₹99.00 |
| శ్రీ గురు సిద్ధారూఢ స్వామి<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |
| అవధూత శ్రీ చివటం అమ్మ<br>(రచన : శ్రీమతి శారదా వివేక్) | ₹99.00 |

### అన్వేషణాత్మకమైన వైజ్ఞానిక గ్రంథములు

| | |
|---|---|
| ఏది నిజం? | ₹49.00 |
| మతం ఎందుకు? | ₹49.00 |
| విజ్ఞాన వీచికలు | ₹99.00 |
| పరిప్రశ్న | ₹119.00 |

### ధ్యాన సంబంధమైన గ్రంథములు

| | |
|---|---|
| ధ్యానయోగ సర్వస్వము | ₹99.00 |
| బుద్ధ ధ్యాన హృదయము | ₹49.00 |

### ఆధ్యాత్మికత - తత్వచింతనా పూర్వక గ్రంథములు

| | |
|---|---|
| శ్రీ సాయి మాస్టర్ ప్రవచనములు | ₹199.00 |
| ఆధ్యాత్మిక జాగృతి<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹199.00 |

### ఇతర గ్రంథములు

| | |
|---|---|
| పురుషసూక్త రహస్యము | ₹49.00 |
| మనము – మన సంస్కృతి | ₹75.00 |

### పూజ్య భరద్వాజ గురుదేవులపై విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| మహాత్ముల ముద్దుబిడ్డడు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹149.00 |
| భగవాన్ శ్రీ భరద్వాజ<br>(రచన : శ్రీమతి శ్రీదేవి) | ₹299.00 |
| మహా పురుషుడు<br>(రచన : పూజ్య గురుపత్ని శ్రీ అలివేలు మంగమ్మ) | ₹60.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –1<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| శ్రీ సాయి మాస్టర్ స్మృతులు –2<br>(సంకలన కర్త : లక్ష్మీ నరసమ్మ) | ₹199.00 |
| ఆచార్య అమృత లేఖావళి<br>(సంకలనం : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹199.00 |
| మరో నంద దీపం | ₹120.00 |
| మాస్టారు అమృత వాక్కులు<br>(రచన : శ్రీ సి.థామస్ రెడ్డి) | ₹99.00 |

### బాలల కొరకు విరచితమైన గ్రంథములు

| | |
|---|---|
| బాలల సాయి లీలామృతము<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹49.00 |
| బాలల సాయిసన్నిధి<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |
| బాలల శ్రీ గురు చరిత్ర<br>(రచన : శ్రీమతి అడిదం వేదవతి) | ₹75.00 |

### BOOKS IN ENGLISH


| | |
|---|---|
| Sai Baba The Master | ₹249.00 |
| Shri Guru Charitra | ₹149.00 |
| Supreme Master | ₹149.00 |
| Tajuddin Baba | ₹149.00 |
| Sai Baba and His Teachings | ₹149.00 |
| Children's Sai Baba The Master<br>*(Author: Smt. Adidam Vedavati)* | ₹80.00 |

### BOOKS IN OTHER LANGUAGES

| | |
|---|---|
| Sadguru Sri Sai Baba (Hindi) | ₹249.00 |
| Sri Guru Charitra (Hindi) | ₹249.00 |
| Sri Sai Leelamruthamu (Kannada) | ₹249.00 |
| Sri Sainatha Prabodhamruthamu (Kannada) | ₹149.00 |
| Sri Guru Charitra (Kannada) | ₹199.00 |
| Sri Sai Sannidhi (Kannada) | ₹249.00 |
| Tibet Yogi Milarepa Charitra (Kannada) | ₹119.00 |
| Sri Swami Samartha (Kannada) | ₹119.00 |
| Sri Sai Leelamruthamu (Tamil) | ₹249.00 |
| Sri Guru Charitra (Tamil) | ₹299.00 |
| Sri Shirdi Sai Aartulu (Tamil) | ₹29.00 |
| Sri Sainatha Stavana Manjari (Tamil) | ₹20.00 |
| Sri Sai Leelamruthamu (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Malyalam) | ₹299.00 |
| Sri Guru Charitra (Odiya) | ₹299.00 |
| Sri Sai Sannidhi (Odiya) | ₹249.00 |

# ‘శ్రీ గురు చరిత్ర’ కృతజ్ఞతార్చన

సెప్టెంబరు 01, 2024




మానవ జీవిత లక్ష్యమైన ఆధ్యాత్మిక పరిపూర్ణతనొందడానికి పూర్ణుడైన సద్గురువును తెలుసుకొని, ఆశ్రయించి తగు రీతిన సేవించడానికి నిర్దుష్ట మార్గమైన ‘శ్రీ గురు చరిత్ర’కు శతకోటివందనములతో కృతజ్ఞతార్చన

Date of Publication: 21st of each month. Permitted to post: 23rd, 24th, 25th and 26th of each month.
Edited, Printed and Published by Dr. R.S. Sasidhar, Ph.D. trustee of Sri Manga Bharadwaja Trust,
Ongole - 523002. Postal Registration Number : Prakasam/16/2024-2026, Regd.No. 37926/83.












శ్రీ సాయినాథుని సన్నిధిలో పుణ్యక్షేత్రమైన శిరిడీలోని శతాబ్ది మండపంలో పూజ్య గురుపుత్రిక శ్రీమతి అడిదం వేదవతిగారు గురుపూర్ణిమ సందర్భంగా 11-7-24 నుండి 17-7-24 వరకు పూజ్య భరద్వాజ గురుదేవులచే విరచితమైన 'శ్రీ సాయి లీలామృతము' సప్తాహ పారాయణ కార్యక్రమము నిర్వహించారు. తెలుగు రాష్ట్రాల నుండి సుమారు 400 మంది భక్తులు భక్తి ప్రపత్తులతో ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.


IF UNDELIVERED, PLEASE RETURN TO: SRI MANGA BHARADWAJA TRUST, KONDAIAH BUNK STREET, KOTHAPETA, ONGOLE, PRAKASAM DT., A.P. - 523002.